అతిబాల్యవివాహము.

—:o:—

ప్రథమాంకము.

౧. ప్రదేశము:—పంతయ్యపంతులుగారియిల్లు.

[పంతయ్యపంతులుగారును, సీతయ్య సిద్ధాంతిగారును కూరుచుండి మాటాడుకొనుచుండఁగా భుజంగరావుగారు ప్రవేశించుచున్నారు.]

పంత—భుజంగరావుగారు! దయచెయ్యండి. (అని కొంచెము లేచి తివాసీ చూపుచున్నాఁడు.)

భుజం—మీరు దయచెయ్యండి. నేను కూర్చుంటాను. స్నేహితులమూ దగ్గిర బంధువులమూ కూడా అయిన మనలోమనకు వచ్చినప్పుడల్లా యిటువంటి మర్యాద లేమిటండీ? (అని కూర్చున్నాఁడు.)

పంత — ఈసిద్ధాంతిగారు బహు ఘట్టివారు సుమండీ. మీకొమార్తె వివాహానికి యీయనచేతనే ముహూర్తం పెట్టించవలెను.

భుజం—నాకొమార్తె వివాహాని కప్పుడే తొందరయేమి? యిక నాలుగేళ్ళ మీదటిమాట. అప్పుడు చూచుకొందాము.

పంత—మీరు ఆలా సెలవిస్తారేమి? మీఅమ్మాయి మాపెద్దకుఱ్ఱదానికంటె నాలుగేళ్ళు పెద్దది. మా అమ్మాయికి రేపు మాఘబహుళంలో పెళ్ళి తలపెట్టినాము.

భుజం—నాలుగేళ్ళు వెళ్ళలేదు. మీచిన్నదానికప్పుడే వివాహమేమిటండీ?

పంత—అవును. పెళ్ళిపనులు చెయ్యడానికి వ్యవధానము లేదుగనుక మొదట యీమాఘమాసములో వివాహం చెయ్యతలచుకోనే లేదండి. సిద్ధాంతిగారు ఏమి సంవత్సరము చైత్ర వైశాఖ మాసములలో ముహూర్తాలు లేవంటూవున్నారు—ఏమండి సిద్ధాంతిగారూ!

రేపు చైత్రమాసంలోగాని వైశాఖమాసంలోగాని పెళ్ళిముహూర్తా లున్నవండీ?

సీత—లేవండి. ఈమాఘబహుళ పంచమీ బుధవారమునా డుంచినదే దివ్యముహూర్తమండి.

భుజం—ఏమయ్యా మాయింటి యెదుట వున్న కోమటి కన్న య్యగారిలోపల చైత్రశుద్ధమందు మీరే వివాహముహూర్తం పెట్టి నారటే; చైత్రవైశాఖాలలో ముహూర్తాలు లేవంటారేమి?

సీత—(కొంచె మాలోచించి) ముహూర్తాల కేమండి? యేవో వొకమోస్తరు ముహూర్తాలు యెప్పుడూ వుంటవండి. చైత్రవైశా ఖాలలోవున్న ముహూర్తాలు తమవంటి గొప్పవారి యిళ్లలో పెట్ట దగ్గవికావు. అవెల్లాకోమటివాళ్ళకూ గొల్లవాళ్లకూ తగివుంటవి. రేపటి మాఘమాసములో పెట్టినది మహామంచిముహూర్తమండి. ఆలాగంటి ముహూర్తము మరినాలుగేళ్ళదాకా రాదండి. కన్నయ్యసెట్టి పెళ్ళా నికి మాఘమాసంలో ప్రసవదినములు వస్తవంటేను కక్కూర్తిపడంలో చైత్రమాసముహూర్తం పెట్టినాను.

పంత—మన కటువంటి కక్కూర్తిపడం యెందుకు? మాఘ మాసంలోనే చేతాము. డబ్బుగలవాడికి రేపు పెళ్ళి తల పెట్టుకుంటే యీాబ స్త్రీలో సమస్తవస్తువులూ అదునుకు దొరుకుతవి. వక్క అప్పడాలూ వడియాలుమాత్రం పెట్టించుకోవలెను.

భుజం — చైత్రవైశాఖమాసాలలో ముహూర్తాలు వున్నా మీాచిన్నదాని వివాహం అప్పుడు చెయ్యడంసమేతు నాకు యిష్టం లేదు. అధమపక్షం పిల్లదానికి పదిపన్నెండేళ్ళు వచ్చేవఱ కయినా అట్టేవుండవలెనని నా తాత్పర్యం.

పంత—మీాయింగ్లీషు చదువుకున్నవారి కందరికీ యేమోకాని

యిటువంటి బుద్ధులే నండీ. స్కూలులో చదువుకునే పదేళ్ళ పిల్లకాయ సమేతూ యిటువంటిమాటలే చెప్పుతాడు. మీరు ముద్దూ ముచ్చట బాగా యెరగరు. చిన్నపిల్లలకు పెళ్ళిచేస్తే వుండేసొగసు పెద్దపిల్లలకు చేస్తేవుండదు. కొంచెము జ్ఞానం వచ్చినతరువాత పెళ్ళికూతురు పల్లకీలో సిగ్గుచేత తలకాయ వంచుకుని కూర్చుంటే యేమిసొగసుగా వుండండీ? అజ్ఞానదశలో వివాహంచేస్తే యేమీ తెలియక ఖులాసాగా పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ నవ్వుతూ పేలుతూ సిగ్గుయెరుగక ఆడుకుంటూవున్నట్టుంటే చూడడానికి బహుముచ్చటగావుంటుంది. చక్కగా చిన్నపిల్లనూ పిల్లవాడినీ పెళ్ళిపల్లకీలో పెట్టి వూరేగిస్తే బొమ్మల పెళ్ళిలాగు బహుఅందంగా వుంటుంది.

భుజం — బొమ్మలపెళ్ళివలె వివాహం వట్టివేడుకకార్యం గాదు. దంపతులు —

పంత — ఆహాహా! పెళ్ళి వేడుక కార్యం కాదంటూవున్నారే. యింకా యేముంది? మనము చేసేశుభకార్యములలో యింతకంటె వేడుకకార్యం యేమివుంటుందండీ?

భుజం — ముందుగానేనన్నది నామాట కడతేరా విని మరీ నవ్వండి. వేడుకకార్యం కాదంటే కేవలంతమాషాకోసం చేసేదికాదని నాఅభిప్రాయం. పెళ్ళివుద్దేశ్యం వధూవరులు యావజ్జీవం సుఖపడడానికిగాని బాజాభజంత్రీలుచూచి మనం సంతోషించడానికే కాదు. కాబట్టి కార్యగౌరవమునుబట్టి సంగతి బాగాఆలోచించవలెను. నేనేమో అమంగళవాక్యాలు పలుకుతూవున్నానని కోపపడవద్దు. నేను మొఱ్ఱోమాటకాదు; లోకసామాన్యంమాట చెపుతాను. కీడెంచి మేలెంచేమని సామెతవున్నది. గనుక, ముందుగా మనము చెడ్డనే చూచుకోవలెను. సాధారణంగా లోకంలో పిల్లలకు పదిపన్నెండేళ్ళలోగానే

మారకం విస్తారంగా వుంటుంది. మనం యెంతచిన్నతనంలో వివాహం చేసినా వధూవరులకు యుక్తవయస్సువచ్చేవఱకూ యేలాగూ వాళ్లు సుఖం అనుభవించడానికి వల్లలేదు. కాబట్టే పిల్లదానివివాహం అయిదేళ్ళప్పుడుచేసినా పన్నెండేళ్లప్పుడుచేసినా ఫలానికి వకటే అవుతుంది. మరీచిన్నతనంలో వివాహం చెయ్యడంచేతమాత్రిం బహునష్టాలు వున్నవి. అందులో పెళ్ళికొడుకు కేమైనా యిబ్బంది తటస్థించినయెడల చిన్నది యావజ్జీవమూ దుఃఖపడవలసివచ్చును. పిల్లదానికేమైనా తటస్థించినయెడల భర్తకు సుఖం కలుగకపోవడమే కాకుండా మొట్టమొదట పెళ్ళికైనసొమ్మంతా వ్యర్థమైపోతుంది. మనము నాలుగేళ్ళుచూచి మరీవివాహంచేస్తే, మొట్టమొదట యిస్తామనుకొన్న వరుడు కాలంచేసినా చిన్నదాని కేమీా యిబ్బంది లేదు; వృథాకర్చున్ను కాదు. ఇస్తామన్నపిల్ల కాలంచేస్తే, పెళ్ళికొమారుడివారికీ ఆలాగే వ్యర్థవ్యయమున్ను లేనిపోని దుఃఖమున్ను కూడా తప్పిపోతవి. మీాకు దగ్గిరబంధువుణ్నీ స్నేహితుణ్నీకూడా గనుక, మీా క్షేమమున్ను పిల్లదాని క్షేమమున్నుకూడా కోరి హితం చెపుతూవున్నాను. నామాటవిని పిల్లదానికి పదిసంవత్సరములు వచ్చినమీాద మరీవివాహం తలపెట్టండి.

పంత — అవును మీారు సెలవిచ్చినమాటలు బాగానేకనపడుతూవున్నవి. కాని మాఘమాసంలో మాపిల్లవాడికుపనయనం తలపెట్టినాము. వాడికి యేడేళ్ళు వచ్చినవి. వడుగుయీాడు దాటిపోయినది గనుక వేగిరం వుపనయనం చెయ్యక తప్పదు. కార్యంలో కార్యం చేసివేస్తే ఖర్చు తక్కువవుతుం దని నాయభిప్రాయము.

భుజం — యేవుపనయనంలో చేసినా డబ్బుఖర్చు తప్పదు. మహా కూడివస్తే ఏభైరూపాయలు కూడివస్తవి; నూరురూపాయలు కూడివస్తవి. వేడుకకు విలువ లేదు. ఇంత డబ్బు ఖర్చు చేస్తేనేకాని

పెళ్ళి కాధని నియమం లేదు. పదిరూపాయలతో చేసినా పెళ్ళే అవుతుంది; పదివేలరూపాయలతో చేసినా పెళ్ళే అవుతుంది. పిల్లదానికి పదేళ్ళు వచ్చినప్పుడు మీరంత చేతిలో డబ్బు లేకపోతే స్వల్పంతోనే చెయ్యవచ్చును.

పంత—అదీ కాదండీ. మాతండ్రిగారు పెద్దలయినారు. మనమరాలి పెండ్లికార్యం చూడవలెనని వారు బహు ముచ్చటపడుతూ వున్నారు. వారు—

భుజం—ఆసంగతికూడా ఆలోచింతాము. మీతండ్రిగారు పెద్దలయినారు. వారు చూడవలెననేకదా మీరు మీపిల్లదానిపెళ్ళికి తొందరపడుతూ వున్నారు ? కాటికి కాళ్ళుచాచుకొని మతిమాలివున్న వగ్గుతండ్రియొక్క వేడుక యెక్కువా ? మీగర్భవాసాన్న పుట్టి యీ లోకంలో యావజ్జీవమూ సుఖపడవలసిన మూడేళ్ళపసికూనయొక్క సౌఖ్యంయెక్కువా ? పిల్లదానిసుఖము విచారించకుండా తన వేడుక కోసం మనుమరాలిని పెళ్ళి చెయ్యమనే యీముసలాయన తాను స్వర్గంలోకూర్చుండి తరువాత దైవికంగా పిల్లదానికి వైధవ్యంతటస్థించి పెద్దవాళ్ళజీవానికి వుసూరుమంటూ యావజ్జీవమూ దుఃఖపడుతూవుంటే తానేమైనా వచ్చి అడ్డపడుతాడా ? ఆయనకు బొమ్మలపెళ్ళి యింత వేడుకైతే నిజమయినబొమ్మలనే రెంటిని పల్లకీలోపెట్టి బాజాభజంత్రిలతో వూరేగించి ఆయనవేడుక తీర్చ—

పంత—పోనియ్యండి ఈసంగతి మరివకప్పుడు సావకాశంగా మాట్లాడుదాము. లోపల యెందుకో పిలుస్తూ వున్నారు. వెళ్ళవలెను.

(అని లేచిగా సందఋను లేచి వెళ్ళుచున్నారు.)

ముసిసిపల్ నాటకము.

ప్రథమాంకము.

౧. ప్రథమరంగము—బుచ్చయ్యపంతులుగారి చావడి.

[కమీషనరులు బుచ్చయ్యపంతులుగారును, గున్నయ్యనాయుడుగారును, సోమిసెట్టిగారును, ఖాదర్‌సాహెబుగారును ప్రవేశించుచున్నారు.]

బుచ్చ — నాయుడుగారూ ! ఇప్పుడు మన మునిసిపాలిటీస్థితి యేమీ బాగావున్నది కాదు. అంతా కొత్తకొత్తవాళ్ళు అప్రయోజకులు కమీషనరుహోదాకు వచ్చినారు. వాళ్ళకు నాలుగుడబ్బులు యేరుకోవడమూ చేతకాదు. యేరుకునేవాళ్ళను చూస్తే వోర్వనూ లేరు.

గున్న — అవునయ్యా వీళ్ళమూలంగా మనవుద్యోగం వఖరంతా చచ్చిపోతూ వున్నది. అక్కడికీ మన ప్రయోజకత్వంచేత యెలాగో నెలకు నాలుగురాళ్లు వాళ్ళు యెంతయేడుస్తున్నా మనవంటివాళ్లం తంటాలుపడుతూ వున్నాముకాని పెద్దమనుష్యులుగా వుండేవాళ్లకు చిల్లిగవ్వ దొరకడం లేదు.

సోమి — ఇది మహాఅన్యాయంగావున్నది. మన మందరమూ చేరి యేదో వకవిధంగా ఆలోచించి యీకొత్తగా వచ్చినవాళ్లను వదల్చుకుంటేనేకాని మన మర్యాద దక్కదు. పూర్వకాలంలో యెంత లేదన్నా అఋఃబారుగురు దీనివల్ల జీవనం చేస్తూవుండేవారు. కొద్దిగానో గొప్పగానో లాభంపొందని కమీషనరులు అప్పుడు నక్కరూ లేరు. నామట్టుకు నాకు యీవకేజిమీద నెలకు ముప్ఫఋరూపాయలు కళ్ళ పడేవి.

ఖాద — భంచోత్ ! మీకీ యేమిదొరికేదోకాని మాకీ పావలా

బేడాకంటె యెప్పుడూ యెక్కువా చేతులో పెట్టలేదు. అప్పుడూ మీారే అంతా దోచుకుదొబ్బేవారు.

బుచ్చ—సాహేబుగారూ! మనలోమనం దొమ్మలాడడం న్యాయం కాదు. మనం యెంతతిన్నా తిన్నవాళ్లమే. మన మందరమూ యేకముగావుంటే అప్పుడు విస్తారం దొరకకపోయినా ఇఖ దొరుకుతుంది.

ఖాద——భాంఛోత్! నేను యేమీా అన్నానయ్యా? నాకీ నెలకీ పదిరూపాయలు ఇస్తానని దస్తావేజు వ్రాసియియ్యా నేను యెందులో దస్కత్ చెయ్యమంటే అందులో చేస్తాను.

బుచ్చ—సరిసరి! ఇందులో దస్తావేజులూ దస్కతు చెయ్యడమూ కూడానా? కాస్త కాగితంముక్క మన విరోధులచేతులో పడితే వాళ్ళు మనకొంప తీసివేస్తారు. వాళ్ళు యెప్పుడు సమయం దొరుకుతుందా అని చూస్తూవున్నారు. వాళ్ళు యెన్నివిధాల తంటాలుపడినా మన ప్రియోజకత్వంచేత మనము దొరకకుండా వున్నాము.

గున్న—అవునవును. మీారు చెప్పినది బహుబాగా వున్నది. అన్నతరువాత లేదనవచ్చును గనుక మనం వెయ్యిమాటలు చెప్పవచ్చునుగాని కాగితంమీాద వక్కఅక్షరం యెక్కించరాదు. అది వాళ్ళ చేతులో చిక్కింది అంటే తరువాత దస్తావేజు అయి గొంతుక పట్టుకుంటుంది.

ఖాద—సరిసరి లేవయ్యా! మీారందరూ యేక ముయి డబ్బ దొబ్బడం మొదలుపెట్టి మానెత్తికి పేడరాయడానికీ యేషాల్ యేస్తూవున్నారు. దస్తావేజు లేకపోతే యెలా నమ్మఖం కుదురుతుం దయ్యా? కావలిస్తే దస్తూరీమాత్రిం లేదనరాదూ! మీాదస్తూరీని సాకు దస్తావేజు వ్రాసి యివ్వండి; మీాకంతగా 'మాటవచ్చేమాట వుంటే యీాదస్తూరీ మీాది కాదని ప్రిమాణంచేసి వాగ్మూలం యిస్తానో లేదో చూస్తురు

గాని. మాటంటే ఖరార్ వక్కమోస్తరుగా వుండవలెను. యెందు కయ్యా నీకీ ఈభయం ? మొన్న హేడ్డుగుమాస్తాగారికి మాట వస్తుం దంటే మన మందరమూ ప్రత్యక్ష్యంగా యెరిగినదానిలో దస్తూరీ అతనిది కాదని వక్కశాకీని పలకలేదూ? అప్పుడు నిజం చెప్పినవాళ్ళ మాటే అబద్ధ ముయిపోయిందా లేదా? ఇందులోనూ అంతే అవు తుంది వ్రాసి యివ్వండి.

బుచ్చ—మీకు వెయ్యిసలాములు పెడతాను. మీరు మాలోకి కలిసివచ్చినా సరే రాకపోయినా సరే. నేను కాగితంముక్కమీద మాత్రిం వక్క అక్షరం వ్రాసి యివ్వను. కలిసివస్తే మీకే లాభం.

ఖాద—మీరు డబ్బు యిప్పిస్తా మని యింతగా నాకీ చెపుతూ వున్నారు. గనుక మీతో చేరుతూ వున్నాను. ఇప్పుడు యీ అరుగుల విషయంలో నాకీ యేమి యిస్తార్?

గున్న—ఇప్పుడు యీకొత్తవాళ్ళు అడ్డం రాకపోతే మనకు ఇందులో పాతికరూపాయలకు తక్కువ లేకుండా వస్తవి. ఇందులో మన ప్రయోజకత్వం కనపరిచి మనపంతం నెగ్గించుకోవలెను

ఖాద—వక్కదెబ్బను నెగ్గించుకుంటాము. సర్కారుస్థలము కలుపుకున్నారన్నా ఫదిగజాలవీధి వున్నప్పుడు అందులో నాలుగు గజాలస్థలము పోతే యెవరికీ యిబ్బంది లేదని వాదింతాము. యెందు కయ్యా అంత వెడల్పువీధి? అక్కడికీ వీధి ఆరుగజాలవెడల్పువుంటుంది గదా ? యేదీ మనవూళ్ళో నాలుగు గజాలవెడల్పుబండి వక్కటి చూపించు. వీధి సన్ననయితే బళ్ళు వెళ్ళడానికి వల్లకాదని చెప్పేవాళ్ళ వాదం మొత్తుకున్నట్టే వున్నది

బుచ్చ—ఆవీధులో పరీక్ష చేసేవాళ్ళు వుంటే వరుసగా రెండు బళ్ళు నేను నడిపిస్తాను. నేను నడిపించలేకపోతే ఫదిరూపాయలు

గునహో యిస్తానుగాని నడిపిస్తే వీధివెడల్పు చాలదనేఃకమీాషనర్లు యెవరయినా నాకు రెండురూపాయలు యిస్తారేమోాకనుక్కోండి. సాహేబుగారూ ! యిందులో మనమంతా వక్కటాకీని పలుకవలెను సుమండీ ? యేమయ్యా మనవాళ్ళు యేడుగురు వుండగా మనం నలుగురంమాత్రిమే ఇక్కడ కనుపడుతూ వున్నాము. వాళ్ళు రాలేదేమి ?

సోమి---వాళ్ళపూచీ నాది. వాళ్ళను యెలాంగు పలికించమంటే అలాగు నేను పలికిస్తాను. వాళ్ళతో యేమి చెప్పమన్నారో చెప్పండి. మనవిరోధు లంతా యెప్పుడూ మీాటింగుకు రారు. మన మందరమూ మీాటింగుకు వెళితే రేపు మెజారిటీ మనదే అవుతుంది.

గున్న—భేష్. అలాగయితే మనకు విజయం అయినట్టే. పంతులుగారూ ! వీధిఅరుగులవిషయ ము యాభయిరూపాయలకు తక్కువవల్లపడ దని ఖండితంగా యీరాత్రి బేర మాడుకొని సొమ్ము చేతులో పడవేయించుకోండి. రేపు మీాటింగులోనుంచి వచ్చేటప్పుడు యీదారినే వచ్చి అందరమూ సొమ్ము పంచుకొందాము.

సోమి—అప్పుడే తొందరపడకండి. రేపు మీాటింగులోనుంచి వచ్చి తరువాత అప్పుడు కార్యం అయిందనుకోవలెను గాని అందాకా కాదు. మునుపటికాలాలలో అయినట్టయితే మనవంటివాళ్ళం మాట్లాడుకోవడంతోటే కార్య మయినట్టే. ఇప్పుడు తీరా నెగ్గినదాకా సందేహమే. మునుపటికాలంలో మేము యెందరికో వుపకారాలు చేసి వాళ్ళనూ బాగుచేసినాము. మేమూ బాగుపడినాము. వెనుక మా యిల్లు కట్టించుకున్నాము కదా వక్కదమ్మిడీ అయినా మనచేతిది ఖర్చు అయిందటండీ? తలావక తాచుపామూ చంపినా రని కూలివాళ్ళ కందరికీ పావలా పావలా యిప్పిస్తే వాళ్ళూ సంతోషపడేవారు మన కార్యమూ అయ్యేది. మ్యునిసిపల్ సొమ్ములోనుండి పదిరూపాయలు ఇప్పిస్తే

యిందులో యెవడితాతసొమ్ము పడిపోయింది! వక్కవీధిని తూము కట్టించవలసివస్తే వెయ్యియిటుకలకు నాలుగువేలయిటుకలు లెఖ్ఖలో వేసి బజారులో అమ్మేదానికంటె రెండురెట్లు యెక్కువఖరీదు పుచ్చుకొని తెల్లవారేటప్పటికి వక్కొక్కయింటిగోడలు లేవతీయించేవాణ్ని. మునుపు ఇటుకగోడ గజానికి యెనిమిదిరూపాయలు ధరవేస్తే ఇప్పుడు రెండురూపాయలకాడికి దిగింది. యేమీ లాభము లేదు. ఆకాలంలో ఇటుకలుకూడా చాలా చవక. ధొరలు ధర్మాత్ములు గనుక వాళ్ళకు యీమాయలూ మర్మాలూ యేమీ తెలిసేవి కావు.

బుచ్చి—మీారు వెనుక దీపాలు పెట్టించేవారుగదా అందులో యేమాత్రం మిగిలేదండీ?

సోమి—అందులో దీపంవక్కంటికి ఫక్తు నాకు రూపాయపైగా మిగిలేది. ఇదికాకుండా యెనమండుగురునవుకర్లు యెప్పుడూ మనయింట్లో పని చేస్తూవుండేవారు. కమీాషనర్ల కందరికీ దీపాలలోకి చమురు ఇందుల నుంచే సప్లయిచేసేవాళ్ళము.

గున్న—వెనుకటిమాట లెందుకుగాని మొన్న వాళ్ళస్థలానికి ఆవరణపుగోడసంగతి యేమైనది? అందులో మనకు యాభయిరూపాయలు దొరుకుతవా?

సోమి—అంతమట్టుకు దొంకవచ్చును. మనకు గేమైనా పెద్ద మొత్తాలు దొరికితే ఇటువంటివాటిలోనే. మనవూళ్ళో ఖాలీస్థలాలు చాలావున్నవి. మనకు యేమయినా పదిరూపాయలసొమ్ము చేతిలో పడితే వాళ్ళచేత మాస్థలానికి గోడపెట్టించుకోవడానికి సెలవు ఇప్పించుమని పిటీషను పెట్టించి, దాని వెనుకపీఠీని మేమెరుగుదుము; ఆస్థలం వాడిదేగనుక సెలవు యివ్వవచ్చునని మనం వ్రాస్తే ఆప్రకారం జరుగుతుంది.

ఖాద—ఇప్పుడు తాటాకులఇళ్ళకు సెలవిచ్చినందుకు ఇంటి వక్కంటికి యెంతవస్తూవున్నదండీ? అందులో నాకు యేమీభాగం రావడం లేదు.

గున్న—తాటాకుఇళ్ళని పేరేకాని ఇంటివక్కంటికి పావలా కంటె యెవళ్లూ యెక్కువ ఇవ్వడంలేదు. మీరోడ్డుకంట్రాక్టులో యేమి దొరుకుతూవున్నదండీ?

బుచ్చి—ఇప్పుడు రేట్లు తక్కువైనవిగనుక కంట్రాక్టుదారులు నూటికి పదిరూపాయలకంటె యెక్కువ ఇవ్వడం లేదు. ఆపదిరూపాయలూకూడా దొరకకుండా యీకొత్తకమీషనరులు పనులన్నీ తమ లోవారిచేతనే చేయించడానికి రిజొల్యూషనులు చేస్తూవున్నారు. యేమైనాఅంటే మనచేత పని కాదంటారు అక్కడికీ మేనేజరు మన వాడుగనుక వాళ్ళు మీటింగులోకి రానప్పుడు వకటీ అరా రోడ్లమర మ్మతులు మనమీద పెడుతూవుంటాడు. అదుగో వెంకటావు వస్తూ వున్నాడు. అతడు మన శత్రుపక్షంలో వాడుగనుక మనం యీసంగతి ఇప్పుడు మాట్లాడుకోకూడదు. రేపు మళ్ళీ ఇక్కడనే మీటవుదాము.

(అని వెళ్ళుచున్నారు.)

---

౨. ద్వితీయరంగము—మ్యునిసిపల్ సభ.

[వైసు ప్రెసిడెంటుగారును, మదనయ్యగారు, నాగభూషణరావుగారు, బుచ్చయ్య పంతులుగారు, గున్నయ్యనాయుడుగారు, సోమిసెట్టిగారు, ఖాదర్‌సాహేబు గారు మొదలయిన కమీషనరులును ప్రవేశించుచున్నారు.]

బుచ్చ—మేనేజరుగారూ! కామిసెట్టి వీధిఅరుగులఅర్జీముందుగా తియ్యండి.

మేనే—అదేపబునివున్నది కాని, దానిలో యింకా కొంచెం

తగాదాగావున్నది. పయిమీటింగుకు నిలుపుచెయ్యవలెను.

మద—యీ మీటింగులోనే ఫరిష్కారం కానియ్యండి. ఆ యింట్లో వెనుక నేను కాపురం వుండేవాణ్ని. ఆసంగతి నాకు బాగా తెలుసును.

గున—ఆలాగైతే తియ్యండి. మేమందరముకూడా యెరుగుదుము. అందరూ యెరిగినవారు వున్నప్పుడే ఇది ఫరిష్కారం కావలెను.

మేనే—ఇందులో దస్తావేజులూ అవీ చూడవలెను. తొందర పడతారేమి వుండండి.

బుచ్చ—(సోమిసెట్టిగారితో రహస్యముగా) ఇందులో మేనేజరుగారిచేతిలో పడేది ఇంకాపడలేదు. అందుచేతనే యీఅభ్యంతరం. అంతా ఆముండాకొడుకు ఇచ్చేది నిన్ననే యెందుకు ఇచ్చినాడుకాడు ?

సోమి—(రహస్యముగా) వాడు నిన్ననే యిస్తానని సొమ్ము తీసుకుని వెళ్ళినాడు కాని బేరం సాయించిందికాదు. ఆయన ఫదిరూపాయలకు వప్పుకోలేదు.

మద—దస్తావేజులసంగతి నాకు తెలుసును తియ్యండి.

సోమి—నాకూ తెలుసును తియ్యండి.

నాగ—అందరు తెలుసునని చెపుతూవుంటే మీకేమి అభ్యంతరం? కాగితాలు తియ్యండి.

మేనే—చిత్రము. తమకందరికీ అభ్యంతరం లేకపోతే ఆలాగే తీస్తాను. అవునోయి నీస్థలంయొక్క వెడల్పు యెంత ?

కా—ఫదిగజాలండి.

బుచ్చ—నీకు బాగాజ్ఞాపకం వున్నదో లేదో జ్ఞాపకం లేదనిచెప్పు.

సోమి—ఏమోయి వూరుకుంటావు ? దస్తావేజు చూచి మనవి చెయ్యవలెనని చెప్పు.

మద——నేను యెరుగుదును. వెడల్పు ఫదిగజాలే. అతడు కమీషనర్లవారి సెలవు పొందకుండానే వీధిలోస్థలం నాలుగుగజాలవరకూ ఆక్రమించుకొని అరుగులు పెట్టినాడు. అవి తీసివేయించవలెను.

కా——అయ్యా! నేను డివిజన్ కమీషనర్ల సెలవుప్రకారమే అరుగులు వేసుకున్నాను. వారు స్థలం హద్దుచూపించి ఇండార్సుమెంటు వెనుకనుంచి పంపిస్తాము వేసుకోవచ్చునని సెలవిచ్చినారు.

బుచ్చ——అవును మేము యెరుగుదుము గనుక గున్నయ్యనాయుడుగారూ నేనూ వెళ్ళి కట్టలు పాతించి హద్దు చూపించినాము. ఇతడు అరుగులు హద్దులోనే వేసుకున్నాడు గాని వక్కయించిఅయినా అవతలికి రానియ్యలేదు.

ఖాద——అవునయ్యా అది మేము యెరుగుదుము. అతడు యేమీ సర్కారుస్థలం ఆక్రమించుకోలేదు. రాజాగారి వీధి మేము యెరుగమటయ్యా?

మద——అది రాజాగారి వీధికాదండి నబాబుగారి వీధండోయి. మీరు యేదో మరో యింటిమాట అనుకుంటూవున్నారు.

ఖాద——అదేఅది. యేవీధయితేనేమి? మేము నబాబుగారి వీధియెరుగుదుము. అన్నివీధులూ యెరుగుదుము. మేము తురకలమై వుండి నబాబువారివీధే యెరగమండీ?

సోమి——యేవీధయినా అతడు స్థలం ఆక్రమించుకోలేదు. ఏమయ్యా నాయుడుగారు! మీరు యెరిగినవారు ఇందులో మాట్లాడక వూరుకుంటారేమి?

గున్న——నేను వెళ్ళి స్వయంగా చూచి ఫరిష్కరించినవాణ్ణే. నాఅభిప్రాయం మరివకలాగు వుంటుందా?

మద——ఆయింట్లో కాపురంవున్నవాణ్ని' నాకంటె మీకందరికీ

మహాయెక్కువ తెలుసునా యేమిటి ? అసలు స్థలం మొట్టమొదట బచ్చువారికి అమ్మిందియెవరు మేముకాదూ ? ఆబచ్చువారిదగ్గిరనుంచి ఇతనుకొన్నాడు. రిజిష్టరీదస్తావేజు తెప్పించి చూచి యేదీఇప్పుడు వెడల్పు కొలిపించండి. నాలుగు గజాలు యెక్కు వున్నదో లేదో కను పడుతుంది.

బుచ్చ——అప్పటిగజాలు బహుపెద్దవండి. ఆఫదిగజాలు యీ పద్నాలుగుగజాలూ వకటేనండి. యేమోయి కామిసెట్టీ కాదుటోయి ?

మద——ఏమండీ మీరు ఆలాగు సెలవిస్తారు ? ఏదీ పెద్దమనిషి కామిసెట్టి కన్యకామ్మవారిమొగం చూచి ఆమాట అనుమనండి.

బుచ్చి——ఆలాగైతే ఆకొలతలో వీధిఅరుగులు పడ లేదు. ఆ నాలుగుగజాలు వీధిఅరుగులకొలత.

మద——యేమిమాటయ్యా ? మునుపాపక్కను అరుగులుండే వటయ్యా ? అక్కడ గుమ్మమే లేదు.

సోమి——అరుగులుండేవి కాని ఈమధ్య రోడ్డుగొత్తు యెక్కువ కావడంచేత పూడిపోయినవి. మదనయ్యగారూ ! మీరుయెవరూ పుట్టక మునుపటినుంచీ నేను ఆస్థలం యెరుగుదును. అక్కడ అరుగులు పూర్వము వుండేవి.

గున్న——అదుగో హదుగో యెరిగినవా రాయన అలాసెలవిస్తూ వుంటే మనమందరమూ వప్పుకొని వూరుకోవలెను.

నాగ——అసలు దస్తావేజులోవున్న దానికంటె నాలుగుగజాలు స్థలం యెక్కువ కనుపడుతూవుంటే యెలాగు వూరుకోము.

మద——వకవిషయంలో వూరుకుంటే అందరూకూడా వీధు లన్నీ ఆక్రమించుకొంటారు.

బుచ్చి——(మదనయ్యగారితో రహస్యముగా) వాడు సర్కారు

వీధి ఆక్రమించుకొన్నాడుగాని యెవరిస్థలమూ అక్రమంగా ఆక్రమించుకోలేదుగదా ? ఇందులో మీాకు యేమినష్టం వున్నది ? బీదవాడు పెట్టుకున్న గోడా అరుగుటూ తీసివెయ్యకుండా అనుగ్రహించి కాస్త తలవూపుదురూ మీాకు బీదవాడికి వుపకారం చేసినపుణ్యాం వస్తుంది.

ఖాద—ఇందులో సర్కారుస్థలం కాస్త కలుపుకుంటే మాత్రము యెవరికి యిబ్బంది వున్న దయ్యా ? వీధి కావలసినంతా యెడల్పా వుండాది. అరుగుల్ వేసుకోఅని ఆర్డర్ యేసీయెయ్యండి.

వైసు—(ఇంగ్లీషులో) కమీాషనర్లు యేమిటంటూవున్నారు ?

నాగ— (ఇంగ్లీషులో) స్థలంకలుపుకున్నట్టు స్పష్టంగా కనపడుతూవున్నది. అరుగులు తీసివెయ్యవలసిన దని వుత్తరువు చెయ్యవచ్చును.

మేనే—అరుగులు వారముదినములలోగా తీసివెయ్యవలసిన దనీ తీసివెయ్యకపోతే ప్రాసిక్యూషన్ చేస్తామనీ ధొరగారు రిజల్యూషన్ ప్యాసు చేసినారు.

ఖాద—ఇది కేవలం అన్యాయం. వాడినోట్లో మన్ను వేస్తే మీాకీ యేమివస్తుందయ్యా ?

బుచ్చి—కామిసెట్టీ ! మేము యేమిచెప్పినా కార్యం లేకపోయినది. నాలుగు నెలలు వూరుకుని యీాసంగతి వుదహరించకుండా మళ్ళీ పిటీషన్ యిచ్చుకో. యీకమీాషనర్లు రానిసమయం చూచి అప్పుడు మేము నీపక్షంగా వుత్తరవుచేస్తాము. ఇంతమాత్రంచేత నీవు ఇప్పుడు అరుగులు తీసివెయ్యనక్కరలేదు లే.

కాపు—చిత్తము మహాప్రభో ! ఎలాగురక్షించినా యేలినవారు రక్షించవలెను. తమరు నాకు యీావుపకారం చేస్తే తమ వుత్తరవు ప్రకారం యేమిదాఖలుచేసుకోమంటే అది దాఖలు చేసుకుంటానండి.

బుచ్చ——ఆట్టే మాట్లాడక వెళ్లిపోవోయి. మేము దాఖలు చేసుకోమనకపోతే నీకు తెలియదూ! అప్పీలుపిటీషన్ దాఖలుచేసుకో పో పో.

నాగ——మేనేజరుగారూ! తరువాత సబ్జక్టు యేమిటో తియ్యండి.

మేనే——ఇందులో యేమీ లేదండి. పల్లపువీధిని వకడు తన స్థలానికి ఆవరణపుగోడ పెట్టుకోవడానికి సెలవడిగినాడు. డివిజనల్ కమీషన ర్లాప్రకారం పెట్టుకోవడానికి అభ్యంతరం లేదని వ్రాసినారు. ఆప్రకారం సెలవు యివ్వవచ్చును.

బుచ్చ——(గున్నయ్యనాయుడుగారితో రహస్యముగా) ఇందులో మేనేజరుగారిచెయ్యి తడి అయింది. ఇది యేప్రకారంగా సద్ది చెపుతూ వున్నాడో చూచినారా?

నాగ——అలాగైతే వుత్తరువు వెయ్యవచ్చును.

మద——కాదు కాదండి. ఇటువంటివాటిలోనే చాలా దగాలు వుంటవండి. ఆస్థలం యెక్కడిదో నాతో చెప్పండి.

గున్న——అది నాడివిజన్‌లోదండి. అదుగో పల్లపువీధులో ధర్మసావడికి యెదురుగుండావున్న ఖాళీస్థలం. అది వాళ్ల హక్కు. గోడలు పెట్టుకోవడానికి శలవు యివ్వవచ్చును.

మద——సరిసరి! అదా? దానినిగురించి నాకు బాగా తెలుసును. ఆస్థలం వాళ్ళభుక్తంలో యెన్నడూ లేదు. వెనుక రిచ్చర్డుధారగారి హాయాములో ఇటువంటి అర్జీ లేవస్తే వల్లకాదని సెలవిచ్చినారు. మేనేజరుగారూ! ఆవెనుకటిరిజల్యూషన్ తియ్యండి.

మేనే——ఏదో యెప్పటిదో పాతపురాణం యెలాకనపడుతుంది? దానికి పనిచేసుకుని నెల్లాళ్ళో రెండునెలలో వెతకవలెను. ఇలాగంటి స్థలాలు మనవూళ్ళో లక్ష వున్నవి. అది యేస్థలాన్నిగురించో. దీన్ని

గురించి ఇదివరకు యెప్పుడూ అర్జీ వచ్చినట్టు నాకు జ్ఞాపకం లేదు.

మద——కాదు కాదండి. దీన్నిగురించే; నాకు బాగా జ్ఞాపకం వున్నది.

మేనే——మీకు యెలాగు జ్ఞాపకం వున్నదోకాని పొరపడి వుంటారు.

గున్న——అవునండీ. మీరనుకున్నది యేదో మరివకటికాని యిది కాదు. దీనివిషయంలోయెప్పుడూ యెవరూ అర్జీ యిచ్చుకోలేదు. యీ విషయంలో విమర్శించినవాణ్ని నాకు బాగా తెలుసును. యెంత విమర్శా చెయ్యకపోతే అర్జీలమీద నేను అల్లాటప్పాగా వుత్తరవు యిస్తానండీ? నేను కుళ్ళు యేమైనా వుంటే అట్టుపుట్టు ఆనవాళ్లతో పెల్లగించి వదిలిపెడుతాను. ఈయింటివాళ్ళు బహుపెద్దమనుష్యులు. వాళ్లు తమ స్తలం కాకపోతే అక్రమంగా వచ్చేవారు కారు.

మద——వెనక తగాదావచ్చినది ఈచోటేనండి. దీనికిచుట్టూ ఆవరణపుగోడ యెప్పుడూ లేదు. పశువులను తోలుకువెళ్లేవాళ్ళు పశువులను దానిలోవున్న రావిచెట్టుకింద తోలుతూ వుండడం నేను యిరవయిసంవత్సరములనుంచి యెరుగుదును. వారి యింటిదస్తావేజు తెప్పించి చూడండి. అందులో యీస్థలము లేదు.

సోమి——అవును. స్థలం మీరు చెప్పినదేకాని దస్తావేజులో లేక పోయినంతమాత్రంచేత హక్కు వాళ్ళది కాదనడానికి వీలు లేదు. తప్ప కుండా హక్కు వాళ్ళదే.

మేనే——అవునండి. యెవరూ తగాదాచేసేవారు లేనప్పుడు మనం గోడ పెట్టుకోవడానికి సెలవు యివ్వడానికి అభ్యంతరం యేమి వున్నది? మరి యెవరిహక్కయినా అయితే వాళ్లే వ్యాజ్యం వేసి పుచ్చు కుంటారు. సర్కారుస్థలమయితే రివిన్యూసైడున కలక్టరుగారే ఆటంక

పెడుతారు. మీరు సెలవు యివ్వండి.

మద——అలా వల్లకాదు.

గున్న—— వల్లకాకపోవడానికి గవర్నమెంటువారు యేర్పరిచిన కమీషనరులము మేము అక్రమంచేసేవాళ్లమా యేమిటి? యిందులో మామాట సాగకపోతే మాకు అవమానంగా వుంటుంది.

ఖాద——అవును బాగా పోట్లాడవయ్యా. ఇందులో మన తక్కువ యేమిటి? వాళ్లయెక్కువ యేమిటి? కావలిస్తే గవర్నమెంటు దాకా వెళుదాము.

బుచ్చ——మనకేం భయమేమిటి తప్పకుండా వెళుదాము. యిందులో మనం వదిలిపెట్టి వూరుకోకూడదు. బాగా పోట్లాడవయ్యా.

సోమి——పోట్లాడడం యెందుకు? మెజారిటీ మనమే వున్నాము. వోట్సు పుచ్చుకుంటే తెలుస్తుంది. యిందులో తప్పకుండా డివిజన్ కమీషనర్ల యిష్టప్రకారం జరగవలెను.

మద——మీరు యెంతమందివున్నా యిందులో న్యాయం చూడవలెనుగాని సంఖ్య చూడకూడదు.

గున్న——మీరు మహాన్యాయం చూస్తూ వున్నారు. మహా మహాకోర్టులలో లంచాలు పుచ్చుకుని వుపకారం చేస్తారు. అంతా మహామడికట్టుకుని కూర్చున్నారా యేమిటి?

ఖాద——యెవళ్లకయినా యేమయినా దొరికిపోతుందని వోర్వలేని ముండాకొడుకులు ప్రతీదానిలోనూ అడ్డం వస్తారు.

మద——మాటలు తిన్నగా రానీ. నీలాగు గడ్డితినేగాడిదెలు వుంటే ——

ఖాద——అదుగో అదుగో మిగలమాటలు రానిస్తూ వున్నావు. ధొరగారు వింటూవున్నారు. నేను మేజస్ట్రీటులో ఫిర్యాదు చేసాను.

మీరంతా సాక్షులయ్యా!

బుచ్చ——చెయ్యండి. యిలాగంటివాళ్లకు వక్కమాటు శిక్ష అయితే యిక యెప్పుడూ మనకు అడ్డం రాకుండా వుంటారు.

వైసు—— (ఇంగ్లీషుతో) కమీషనర్లు పోట్లాడుతూ వున్నారు. నేను వెళ్ళిపోతాను.

మేనే—— (ఇంగ్లీషుతో) దీనిమీద గోడలు పెట్టుకోవచ్చునని వుత్తరవువేసి వెళ్లండి.

నాగ—— (ఇంగ్లీషుతో) వారు అలాగు చెపుతూవుండగా యిప్పుడు వెయ్య వల్లకాదు.

వైసు—— (ఇంగ్లీషుతో) నేను వెళ్ళిపోతాను.

(అని వెళ్ళుచున్నాఁడు.)

---

3. తృతీయరంగము——సోమిసెట్టిగారి యిల్లు.

[ఖాదర్‌సాహేబుగారును, బుచ్చయ్యపంతులుగారును, గున్నయ్యనాయుఁడుగారును, సోమిసెట్టిగారును, కామిసెట్టియు ప్రవేశించుచున్నారు.]

బుచ్చ——ఏమోయి కామిసెట్టీ! మేనేజరుగారియింటికి వెళ్ళి రాత్రి ఫరిష్కారం చేసుకున్నావా?

కామి—— ఏమిఫరిష్కారమండీ? ఆయనకు దాహం మహా విశేషంగా వున్నది. అంతదాహం నేను తీర్చలేనండి.

బుచ్చ——నీవు యెంతయితే యిచ్చుకుంటావు?

కామి——నేను పదిహేనురూపాయలకు వక్కగవ్వ యెక్కువ యిచ్చుకోలేనండి ఆయనవక్కడికే అయితే ఇంకా ఫదిరూపాయలు ఇచ్చుకోమన్నా ఇచ్చుకుంటాను. ఇందులో మీకు యాభైరూపాయలు ఇచ్చుకోవలెనాండి? శానిటరీ యినస్పెక్టరుగారికికూడా యేమయినా

ఇచ్చుకోవలె నని మీరే సెలవిచ్చినారండి! ఇంకా యెంతమందికి యేమి యిచ్చుకోవలెనో! ఆయనక్కడూ మూఁప్పయిరూపాయలు వాళ్ళో పొయ్యమంటే ఎట్లా పొయ్యగలనండీ ?

బుచ్చు—సమయం వచ్చినప్పుడు తప్పుతుందీ ? ఇవాళ వచ్చిన ఖర్చు రేపురాదు. నీకు కొట్టుఅరుగులు కావలసివున్నట్టయితే ఇల్లో వాకలో తాకట్టు పెట్టి నాలుగురూపాయలు హెచ్చుతగ్గుగా సొసాయించుకో. ఆయనచేతులో మంత్రపుష్పం పడకపోతే రిజల్యూషన్ ప్రకారం హుకుం వ్రాయించి రేపు యీపాటికి అరుగులు తవ్వించి వేస్తాడు. స్వాములవారికి చెల్లించవలసిన ముడుపు చెల్లించినట్టయితే ఇది పడవేసిపెట్టి యేదో వకవిధంగా హుకుములు వ్రాస్తూ ఆరునెలలు జరుపుతాడు. యీలోగా నీవు యెప్పుడయినా మళ్ళీ అర్జీ పెట్టుకుంటే వోర్వలేని కమీషనరులు లేనికాలములో మేము నలుగురమూ వున్నప్పుడు పెట్టి అరుగులు పెట్టుకోవలసిన దని దానిమీద గీటు పెట్టించివేస్తాడు. అంతకూ వల్లకాకపోతే అరుగులు తీయించివెయ్యవలసిన దని హుకుం వ్రాసి దొరగారి సంతకం చేయించి శానిటరీ ఇన్‌స్పెక్టరుకు పంపించినట్టు ఆఫీసుబుక్కులో యింటరుచేసి పంపించకుండా వూరుకుంటాడు. నీవు నాలుగురూపాయలు శానిటరీఇన్‌స్పెక్టరు చేతులోకూడా పెడితే యెవ్వరూ ఆసంగతి కదిపేవారే లేరు. ఈ పోట్లాడినకమీషనరులంతా అరుగులు తీసివేసినారో లేదో అని మళ్ళీ వచ్చి చూస్తా రనుకున్నావా యేమిటి ? అందులో ఇంతశ్రద్ధ యెవరికి ? ఆమీటింగులోకి వచ్చి నాలుగుముక్కలూ వాగి చక్కాపోతారు. తరువాత యేమి జరిగిందో యేమిటో మళ్ళీ దానిజోలి తలపెట్టరు. కార్య మంతా మాలో వున్నది. మేనేజరూ మేమూ శానిటరీ ఇనస్పెక్టరూ యేకమై ఇదివరకు ఇటువంటి రిజల్యూషనులు లక్ష

అమలు జరగకుండా ఆపివేసినాము. యెవడు కనుక్కున్నాడు.? మా చేతులో పడకపోతేమాత్రం వక్కపని సాగదు. మేము ప్రతివీధీ తిరిగి ఇటువంటికుళ్ళు యేమయిన వుంటే పయికి యెక్కతీసి మమ్మ సమాధానం చేసుకోకపోతే మూడు చెరువులనీళ్ళు తాగించి మరీ వదిలి పెడుతాము. యేమి మా యాభయిరూపాయలూ తెచ్చినావా ?

శామి—కార్యమైతే ఇచ్చుకోక యేమిచేస్తానండీ ? మీాకూ మేనేజరుగారికీ కట్నం సమర్పించుకుంటే ఇఖ నేమీా యెవరికీ ఇవ్వ నక్కర లేదుగదండీ ?

బుచ్చ.—ఇది మహానైవేద్యం. ఇది యిచ్చుకుంటే ఇఖ చిల్లర దేవతలకు రూపాయా అర్ధా ఇచ్చుకోవలసినదేకాని ఇంత పెద్ద మొత్తం యేదీ వుండదు. ఆవీధిని పనిచూసే బంట్రోతువాళ్ళచేతిలో చెరివక అర్ధాపెడుదూ. దానితో సరిపోతుంది.

శామి—అంతేనాండి? ఇఖ శానిటరీయిన్ స్పెక్టరుగారికి యేమీా ముట్టచెప్పనక్కర లేదుగద?

బుచ్చ—యేది తప్పినా శానిటరీయిన్ స్పెక్టరుగారిది తప్పదు. అది తండ్రితద్దినంవంటిది. నీయింట్లో భోజనం మానుకొని అయినా వెంకటేశ్వరులముడుపు అది చెల్లించవలెను.

శామి—ఆయనకు వెనుక అరుగులు కట్టిచుంకునేటప్పుడు ఆటంక పెడితే రెండురూపాయలు ఇచ్చినానండి.

బుచ్చ—అది అవసరనైవేద్యం. అప్పటికి సరిపోయింది. ఇప్పుడు ఇచ్చేది మహానైవేద్యం. ఇది ఇచ్చుకుంటే ఇఖ యీాఅరుగులనిమిత్తం మళ్ళీ ఇచ్చుకో నక్కర లేదు.

శామి—ఇంతమంది దేవతలకు ఇన్నిమాట్లు యిచ్చుకోవలసివస్తే మావంటి బీదవాళ్ళము యీాపట్నవాసాలలో బ్రతేకగలమండీ ?

బుచ్చ—డబ్బునోట్లో దేవుడున్నాడు. యేమిసమర్పించుకోక పోతే దేవతలకుమాత్రం నీమీద అనుగ్రహం యెలావస్తుంది? దేవతా ప్రసాదం కావలిస్తే మీదుకట్టింది తీసుకువచ్చి చెల్లించి ఆపద తప్పించుకోవలెను. నీవు యెరుగవుకాని కొన్ని దేవతలకు నిలువుదోపు కూడా ఇవ్వవలసి వస్తుంది. ఆవువంటిదిసమేతూ కడుపునిండా మేతమేస్తేనే కాని. చేపదు. మేతలేకుండా యీకామధేనువులుమాత్రం పొడి పొడిదణ్నాలతో వరాలు కురిపిస్తవనుకున్నావా ? ముందుగా మొక్కుకున్నది మొక్కు చెల్లించుకో.

కామి—యే దేవతయినా కార్యమయినతరువాత మొక్కు చెల్లించుమంటుంది గాని ముందుగానే చెల్లించమనదు. కార్యమైతేనే కాని నేను యేమీ ఇచ్చుకోలేను.

బుచ్చి—కామిసెట్టీ ! చెవులోమాటోయి. (రహస్యముగా) మేనేజరుగారితో చెప్పి ఆయనచేత నాలుగురూపాయలు మాన్పించి నీకు చాలాకిఫాయతు చేయిస్తాను. శానిటరీ యిన్స్పెక్టరుగారికి కూడా ఇప్పుడంతా ఇచ్చుకోనక్కరలేకుండా సగంమాత్రమే ఇప్పుడు ఇచ్చుకునేటట్టు సిఫారసు చేస్తాను. మా యాభయిరూపాయలుమాత్రం ముందుగా తెచ్చుకో. ఇఖ మాట్లాడకు తక్షణం వెళ్ళిపో.

కామి—చిత్తము. (అని వెళ్ళుచున్నాడు.)

ఖాద—యేమిటయ్యా ? మే మింతసేపటినుంచీ కూకుండాము. భాంచోత్ మా౦చేతిలో వక్కపైసా పడలేదు.

గున్న—తొందరపడకయ్యా ! పంతులుగారు అందువిషయమే కాదూ తంటాలు పడుతూవున్నారు. సొమ్ము చేతులో పడడంతోటే వక్కదమ్మిడీ మిగుల్చుకోకుండా యెవరిది వారికి పంచిపెడతారు.

ఖాద—భాంచోత్ మీహిందువుల్కీ మాకీ నమ్మం. డబ్బా

సేతిలోపడితే దగాసేస్తార్. ముందుగా నావంతునాకీ ఫైసల్ సెయ్యండి.

సోమి—సొమ్ము రానిదే ముందుగా యెవరయినా పెట్టెలో డబ్బు తెచ్చియిస్తారటయ్యా? రానియ్యండి.

ఖాద—అదంతా మాకీ తెల్‌గు. ముందుగా మాసేతిలో డబ్బు యేసి మాట్లాడండి.

బుచ్చి—మీచేతులో వెయ్యడానికి ఇప్పుడు యెవరితాతముల్లె దాచిపెట్టినారు ? సొమ్ము వస్తే అందరమూ పంచుకుందాము.

ఖాద—భాంచోత్ మీరంతా యేకమయి నాసొమ్ము యెగ బెట్టడానికి యేపాల్ యేస్తూవుండార్. ఈయన చెవులో యేదో గుస గుసలాడి సొమ్ము ఇదివరకే లాగియేసినాడు. నాపన్నెండు రూపాయల నరా అక్కడ పెట్టి మాటాడండి.

బుచ్చి—నేను యేమీ పుచ్చుకోలేదు. కావలిస్తే నాబట్టలు సోదాచూడు.

ఖాద—మాకీ ఏమీ ఖబుర్లతో జరూర్ లేదు. మీహిందువులు గారడీసేసి సొమ్ము మాయంసేసివేస్తార్. నావంతుసొమ్ము అక్కడ పెట్టి కదలండి.

సోమి—సాహేబుగారూ ! కొంచెం వోపిక చెయ్యండి. ఖోదా తోడు. మీసొమ్ముకు నేను పూచీపడతాను. తక్కిన సంగతులు ముందుగా కానియ్యండి.

బుచ్చి—మేనేజరుగారు ముసద్దీపేచీ యేలాపెట్టినారో చూచినారా? మనం యింతమందీ యేకమైనా కార్యంలేక వక్కమాటతో అడ్డి వూరుకున్నది.

గున్న—ఆయనసామర్థ్యం మరివకరికి రాదు. నాలుగు మోసర్లు దస్తూరీ వ్రాస్తాడు. ప్రత్యేకంగా తాను వ్రాసింది తనదస్తూరీ కా

దని సాధించి తనతప్పితం ఇతరులమీద తోసివేసేశక్తి యీాయనవద్దనే వున్నది. మనం వక్క-ఘడియ యీాయనవద్ద మాట్లాడితే యింటికి వెళ్ళినతరువాత తలలు మార్చినాడేమో అని అద్దంపెట్టి మన ముఖాలు చూచుకోవలెను.

సోమి—అటువంటి మాయోపాయాలూ ఇంద్రజాల మహేంద్ర జాలలూ వున్నవి కనుకనే యెంతలేదన్నా యేవరేజీమీాద రోజుకు నాలుగయిదురూపాయలకు తక్కువ లేకుండా యేరుతాడు. ముందుగా దక్షిణ ఆయనచేతిలో పడితేనేకాని వక్క-పిటీషన్ మీాటింగులోకి రాదు.

బుచ్చ—యీాసంగతులు మనకు కొత్తయేమిటి కాని మనం మాట్లాడుకోవలసినసంగతులు మాట్లాడుకుందాము. కామిసెట్టిఅరుగుల విషయంలో అనుకూలంగానే జరుగుతుంది. మొన్నటి స్థలానికి ఆవరణపు గోడవిషయంలోకూడా మన కనుకూలంగా జరిగితే బాగుండును. అదీ పెద్దపద్దే.

గున్న—అందులో మేనేజరుగారుకూడా మనపక్షమే. మనకు తప్పకుండా విజయం కలుగుతుంది. డివిజనల్‌కమీాషనర్లు సిఫారసుచేసి మెజారిటీ మనమైనప్పుడు మరివకలాగు యెలాగు జరుగుతుంది?

సోమి—తప్పకుండా అందులో మనకార్యం అవుతుంది యెందరు యేడిస్తేయేమి? సిద్ధసంకల్పులు మీారు తలపెట్టిన కార్యం కాకపోవడంకూడానా? మనం టోలు కంట్రాక్టరుకు యెనిమిదివందలరూపాయలూ రిమీాషన్ ఇప్పించడంలో మన యెవరెవరిశక్తి కనపడవలెను. ఇందులో మనం యీావుపకారం చేస్తే రెండువందల రూపాయలు వక్క-సారి ఘళ్ళుమని చేతిలో పడతవి. మేనేజరు యిదివరకే పెద్ద మొత్తం మాట్లాడుకొన్నాడు. మనంకూడా అందులో చేరకపోతే

యేదోవకవిధంగా గీటు పెట్టించి గళగ్రాహి అంతా మేనేజరే మింగి వేస్తాడు.

ఖాద——భాంచోత్. ఆడూయీడూ మింగివేస్తార్ అనిచెప్తూ అంతా మీరే మింగియేస్తూ వున్నారు. అరేమీకీ యీసర్కీ మూడు నాల్గువందాల్ వచ్చాయి. నాకీ వక్కరూపాయీ యిచ్చారు లేదు. నా వంతూ నాసేతులో పడాయెయ్యండి. తరువాతా మాటలూ ఆడుకోం దురుగాని.

బుచ్చ——వుండవయ్యా మేమూ సొమ్మువచ్చే వుపాయమే ఆలోచిస్తూ వున్నాము. మనకు యేమీ దొరకకుండా చెయ్యడానికి మదనయ్య ఇప్పుడు మహాపని చేస్తూవున్నాడు. ముందుగా మనం అతనితాళం పట్టించవలెను.

గున్న——అద్దే ఆదెంతసేపు? మన మందరమూ యేకముయితే నాలుగునెలలలో మనకు విరోధులుగా వుండేకమీషనర్ల నందరినీ యేరి పారవేస్తాము. మదనయ్య లంచాలు పుచ్చుకుంటూ వున్నాడనీ కంట్రాక్టుదార్ల వద్ద కడితేరుస్తూవున్నాడనీ మనవైసుప్రసిడెంటు మెస్టరు లేజీధోరగారితో నేను చెప్పి నిప్పంటిస్తాను. మీరందరూకూడా సమయం వచ్చినప్పుడు తలావకపుడకా వెయ్యవలెను. నేను ఇదివఱకే మార్కెట్టు ఇనస్పెక్టరుగారిచేత మనవిరోధు లందరిమీదా బాదులు బాదించినాను. సమయంవస్తే అవిఅన్నీ యెలా పనిచేస్తవో మీరే చూస్తారు. మనము అన్నిపక్కలనుంచీ బారులు చేస్తే వక్కసారి అవి అన్నీ ఫిరంగీగుళ్ళలాగు తగులుకోవూ? చూడు నాధాక కనుపరుస్తాను. వాళ్లను వొక్కొక్కళ్ళనే కమీషనర్ హోదాలోనుంచి తీసివేయించక పోతే నాపేరు గున్నయ్యనాయుడు కాదు.

(అని మీసము మెలివేయుచున్నాడు)

బుచ్చ్చి—ఖిూకంటె ముందర్తిగానే నేను మేనేజరుగారిచేత వాళ్ళమీాద వుూదర పెట్టించినాను. అంతా లోపల పొగ రాజుతూ వున్నది. యెప్పుడో గభీలు మని మండి పయికి లేస్తుంది. మన వైసు పెసిడెంటు శుద్ధబుద్ధావతారముగాని లేకపోతే యీపాటికి వాళ్ళను చీమలిని మాడ్చివేసినట్టు మాడ్చి వెయ్యడూ ?

సోమి—మనం యెంతప్రియత్నం చేసినా ఇంకా వాళ్ళదినాలు బాగావుండడంచేత వాళ్ళఆటలు సాగుతూ వున్నవి. ఇంకా యెన్ని దినాలు సాగుతవో చూతాము కాదూ ?

ఖాద—ఆళ్ళదినాలూ లేవు యీాళ్ళ దినాలూ లేవు. ఇప్పుడు నా దినాలు భాగాలేవు. నాకీ యీరాత్రికీ ఫనిరూపాయలు వుండాలె. మీాలో యెవరయినా ఇచ్చుకోకపోతే మీాఆబురీ దక్కనియ్యను.

బుచ్చి—ముందుగా ఇవ్వడానికి మాదగ్గిర సొమ్ము లేదు.

ఖాద — భాంచోత్ మాకీ రూపాయలూ యియ్యకపోతే నేను ఇప్పుడు పోయి మదనయ్యగారితో యీావత్తుకుట్రి మనవిచేసి మీామీాద సాక్ష్యం పలికి మిమ్మల్ని వక్కొక్కడినే బొక్కలోకి తోయి స్తాను. (అని లేచి వెళ్ళుచున్నాడు.)

బుచ్చి — సాహేబు వెళ్ళిపోతూవున్నాడు పట్టుకోవయ్యా. పట్టుకోవయ్యా.

(అని అందఱును వెనుక వెళ్ళుచున్నారు.)

ద్వితీయాంకము.

ప్రథమరంగము—ధర్మసావిడి.

[పోలిసెట్టియు, రామిసెట్టియు, గురయ్యనాయుడును, భీమలింగమును, కూరుచుండియుండఁగా వంకాయలచంద్రివ్మ ప్రవేశించుచున్నది.]

పోలి—రామిసెట్టిగారూ! మీరు నాలుగురోజులనుంచి దుకాణం వదిలిపెట్టి మహాతిరుగుతూవున్నారు. మీవ్యవహారం ఫరిష్కారం అయినదా ?

రామి—తడిమన్నంతా పొడిమన్నయ్యేటట్టుగా యీ నాలుగు రోజులనుంచీ మేనేజరుగారి ఇంటిచుట్టూ తిరగగా తిరగగా వక్క శతమానంతో నేటిదినం ఫరిష్కారముఖుంది. మేము ఫదిమందీ ఫది ఫదులు వేసుకుని నూరురూపాయలమూటా యీవుదయాన్న పట్టుకుని వెళ్ళి సమర్పించడంతోటే మాపేర్లు లీష్టులోనుంచి తీసివేసినారు.

పోలి—యీ మునిసిపాలిటి బహుఅక్రిమంగా వున్నది. అన్యాయంగా ప్రిజలసొమ్ము దోచుకుంటూవున్నారు. నేను ముందటియేడు బోలెడుసొమ్ము మేనేజరుచేతులో పోసినాను. ఆసంవత్సరం కాస్తపన్ను తగ్గించినట్టే తగ్గించి నిరుడు సంవత్సరం మళ్ళీ హెచ్చుచేసి జాబితాలో వ్రాసి నోటీసు పంపించినారు. అందుమీద నేను మదనయ్యగారివద్దకి వెళ్ళి యీఅన్యాయం యేమిటని మొత్తుకుంటే నీవు వొక్కదమ్మిడీ యెవ్వరికీ ఇువ్వనక్కర లేదు. అప్పీలు చేసుకోమని సెలవిచ్చినారు. అందుమీద నేను అప్పీలు చేసుకుంటే నాఅదృష్టంచేత మంచికమీషనర్లు నలుగురు రావడంచేత హెచ్చుచేసినసొమ్ము కొట్టివేసి యెప్పటి పన్నే ఖాయం చేసినారు. ఇలా ప్రయివేటుగా వీళ్ళకూ వాళ్ళకూ దర్శించుకోవడంకంటె పబ్లీకుగా అప్పీలు చేసుకుంటే, మన అదృష్టము

బాగావుంటే పన్ను కొట్టుబడేపోతుంది. మేనేజరూ యిద్దరు కమీషనర్లూ చేరి యీజాబితాలు పూరికే తయారుచేసి ఫదిమందివర్తకులను పిలిపించి యిచ్చినవాళ్ల పేర్లు తీసివేసి ఇవ్వనివాళ్ల పేర్లు మీటింగులో పెడుతారు.

రామి—అవును. ఆమాట నిజమేకాని అంతధైర్యం యెవరికీ వుండదు. వంకాయలపాపిసెట్టివద్ద పాతికరూపాయలు లంచంపుచ్చుకుని పన్ను యెంతో తక్కువ కట్టినారు. ఫదిసంవత్సరాలనుంచి వక్కమోస్తరుగా సాగివస్తూ వున్నదా లేదా? రెండేళ్లకూ మూడేళ్లకూ వక్కమాటు పన్ను మళ్ళీ యెక్కువ కడతామని బెదిరిస్తూవస్తే నాలుగూ అయిదూ వాళ్లమొగాన్ని పారవేసి నోరణుస్తూ వుంటాడు. అతనికి పోయినవల్లా మహాపోతే నూరురూపాయలకంటె యెక్కువ వుండవు. వచ్చినకిఫాయతు చూడబోతే యెంతలేదన్నా యీఫదేళ్ళల్లోనూ మూడునాలుగువందలరూపాయలకు తక్కువ వుండవు. ముసద్దీలతో కతకట్టడంకంటె వాళ్లచేతులో నాలుగుడబ్బులసొమ్ము పెడితే యెందెందులకూ మంచిది. వాళ్లు తలచుకుంటే యెప్పుడయినా కాస్తవుపకారం చేస్తారు. వాళ్ళమామూలు వాళ్లచేతులో పడకపోతే కార్పణ్యం మనసులో వుంచుకుని యెందులోనైనా పట్టుకొని నొక్కుతారు. మొన్న మాభావమరిది మామూలు నాలుగురూపాయలు ఇచ్చినాడుకాడని శానిటరీఇనస్పెక్టరు గుమ్మముముందర పెంటవున్నదని ఛార్జీషీటుచేసి రెండునెలలలో ఫదిరూపాయలు జులుమానా వేయించినాడు? అటుతరువాత పిచ్చుతవ్వతో కొలిచినాడని ఫిర్యాదుచేసి యాభయిరూపాయలు వదిలిల్చినాడు. అతనిచేతిలో మొట్టమొదటనే నాలుగురూపాయలూ పెట్టినట్టయితే యీదండుగలన్నీ తప్పేవేనా? తరువాత చచ్చినట్లు ఫది రూపాయలు సమర్పించినాడు.

పోలి——మనం తిన్నగావుంటే యెవరికీ ఝడియనక్కర లేదు. మనదగ్గిర పిచ్చితవ్వాలు యెందుకు వుంచుకోవలెను? తరువాత కచేరీ చుట్టూ యెందుకు తిరగవలెను? మనం న్యాయంగావుండి యెక్కువ పన్ను కట్టినప్పుడు అప్పీలు చేసుకుని మన లెక్కలు దాఖలుచేస్తే పన్ను తీసివెయ్యక యేమిచేస్తారు?

రామి——న్యాయంగా ప్రవర్తిస్తే వర్తకమే సాగదు. ప్రతిదానిలోనూ కొంచెం అబద్ధం వుండవలెను. మొన్న న్యాయమైనలెఖ్ఖలు దాఖలుచేసి తనకు అక్రమంగాకట్టినపన్ను యాభైరూపాయలూ మాఫు చెయ్యవలసినదని నరసయ్య అర్జీ యిచ్చుకుంటే అందరూ యెరిగివున్న సంగతిలో కమీషనర్లందరూచేరి అప్పీలు కొట్టివేసి పన్ను ఖాయం చేసినారు. అందులో యెంత అన్యాయం జరిగింది! మొట్టమొదట మేనేజరుకూ వాళ్లకూ పదిరూపాయలు పారవెయ్యవలెను. న్యాయంగా వెళ్ళుతానని భీష్మించుకుని కూర్చోవడంచేత యీఅనర్థం అంతా పొసగింది. అందుమీాదట మొన్న బుచ్చయ్యపంతులుగారు కొట్లోకి వచ్చి రెండురూపాయల ఖరీదుచేసే ధోవతులచాపు వూరికే యివ్వమంటే ఆయనకు యివ్వకపోవడంచేత అప్పీలుకూడా తువరమైనది. బుచ్చయ్యపంతులుగారాలెఖ్ఖలు దొంగలెఖ్ఖ లనేటప్పటికి వారి పరివారమంతా వక్కతాకీని అవి దొంగలెఖ్ఖలని వేశారు. అంతటితో న్యాయంగా చెప్పేకమీాషనర్లు యేమిచెప్పినా కార్యం లేక మెజారిటీ చెప్పినట్టు అయినది. ఏమయ్యా? గురయ్యనాయుడుగారూ! మీా అభిప్రాయం యేమిటి?

గుర——నేనూ మీా అభిప్రాయంలోనే యేకీభవిస్తాను. మీారన్నీ అనుభవంచేత చెప్పిన మాటలుగాని మరొకటి కావు. మనం యేలాగో వోలాగు మంచితనంగా వుద్యోగస్థులను సమాధానపరచు

పోకపోతే వాళ్ళు పెట్టేతంటాలు మనం పడలేము. మాకు యీభయి రూపాయలుపన్ను అధికంగా కట్టినట్లు మీ కందరికీ తెలుసును. మా దగ్గిర సరియైన లెక్కలుకూడా వున్నవి. అయితే లౌక్యబాధకాలూ చిక్కులూ వుండడంచేత మేమూ లెక్కలు పబ్లీకులోకి తీసుకునివచ్చి కనపరచడానికి వల్లకాదు. మేము చేసేది సారావ్యవహారం. అందులో అనేకమంది బ్రాహ్మలు ప్రతిదినమూ మావద్ద బ్రాందీ జిన్నూ మొదలయినసారాలు బుడ్లాది పట్టుకువెళుతూ వుంటారు. వక్కమాటు బుడ్లుగా కొనుక్కోలేని బీదబ్రాహ్మలు కొట్లోకే వచ్చి గ్లాసుచొప్పున కొనుక్కుని అక్కడనే తాగిపోతారు. వారిపేర్లన్నీ మాచిత్తాలో తగిలి వుంటవి. వక్కసారి ఆబుక్కు బయలపెడితే మరునాటినుంచీ మా వ్యవహార మంతా తొంగుంటుంది. మొదట మావాడు తెలివితక్కువ పనిచేసినాడు. పన్నుకట్టేటప్పుడు వాళ్ళడిగినట్టు యీభయిరూపాయలూ ఆముగ్గురి నలుగురి కమీషనర్లకూ యిచ్చినట్టయితే యేమాసికలూ అక్కరలేకుండా యీయీభయిరూపాయలపన్నూ అప్పుడే తగ్గిపోవును.

పోలి——బ్రాహ్మలు తాగగాలేనిది లెక్కలు చూపిస్తే మహా ముక్కవతప్పితం వచ్చినదా యేమిటి? మనకు కొంచెంనష్టం వచ్చినా న్యాయానికి కట్టుపడి వుండవలెను. కొన్నివేళల్లో తప్పిపోయినా సాధారణముగా న్యాయమే అక్కరకు వస్తుంది.

భీమ——అలాగు అనరాదు. యీప్రపంచంలో సాధారణంగా అన్యాయమే అక్కరకు వస్తుంది. యీవూళ్ళో మునిసిపల్‌కమీషనర్ కందుల సోమిసెట్టిదగ్గిర వున్నడబ్బు న్యాయంగా ప్రవర్తించే మీదగ్గిర వున్నదేమో చెప్పండి. లోకంలో డబ్బువుంటేనే అన్నిగౌరవాలూను.

పోలి——వెధవడబ్బు అటువంటిడబ్బు లేకపోతే నేమిటి? గుణం ప్రధానముగాని డబ్బు ప్రధానం కాదు. డబ్బుమూట పట్టవస్తే మన

పూళ్ళో భోగం చంద్రిముఖిదగ్గిర కావలసినంతడబ్బే వున్నది.

భీమ——నేను చెప్పినది వక్కడబ్బుమాటే కాదు. యెందులోనూ బంగారానికి టంకంపొడి వేసినట్టుగా యెంత నిజమయినా మధ్య నాలుగుఅబద్ధాలు వేస్తేనేకాని అతకదు. న్యాయంగాపోతే అన్నీ తంటాలే వస్తవి. అందరితోనూ విరోధాలే వస్తవి. కేవలం సత్యంతో కూర్చోక కొంచెం లౌక్యంకూడా చూడవలెను. మనపట్టీలజాబితాలు అందరికీ నిజమయినవి కనపరుస్తామా? మనం దగ్గిర వుంచుకునేది వకటీ, యితరులకు చూపించడానికి తయారుచేయించేది వకటీని. మనచిత్రాలలో కూడా అమ్మినది వున్నట్టుగా వేసి కొనవచ్చినవారి కల్లా పద్దులు చూపిస్తూవుంటే మనకు యేమయినాలాభం వస్తుందీ? మనం రూపాయికి రూపాయిపావలా వేసి కొత్తగా వచ్చినవారికి రూపాయబేడకాడికి యిచ్చి అయినా యెంతోలాభం చేసినట్టు కనపరచవలెను. మశ్నీ మ్యునిసిపల్ వారు యెక్కువపన్ను కట్టకుండా మనం దినానికి యాభయి రూపాయలసరుకు అమ్మితే యిరవైరూపాయలసొమ్మే అమ్మినట్టు పయికి కనపరిచి మన లోపాయికారీ లెఖ్ఖలలో తక్కినది వేసుకుని రహస్యంగా వుంచుకోవలెను. ఇటువంటి రహస్యాలన్నీ వర్తకులం మనము మనలో వుంచుకోవలసినవేగాని పబ్లీకులో చెప్పదగినవి కావు.

పోలి——మనం ఇన్నిదగాలుచేసి ఇన్నితంటాలు పడినాగానీ మనలో వక్కడిదగ్గిరా పట్టుమంటే ఫదివేలరూపాయలు లేవు. దొరలు చూడు కంపినీలుపెట్టి న్యాయంగా వ్యవహరిస్తే వకటి రెండు సంవత్సరాలలో లక్షలకొద్దిసొమ్ము యెలా సంపాదిస్తారో! మీరు యెన్ని మాటలు చెప్పినా యెప్పుడూ చిట్టచివరకు న్యాయమే అక్కరకువస్తుందని నానమ్మకము. యేమి చంద్రిమ్మా! అట్టే నిలుచున్నావు. నీ కూరగాయలవ్యవహారంలో లాభం బాగా వస్తూవున్నదా ?

చంద్ర——యేమిలాభమండీ బాబూ! అడ్డమయినగాడిదకొడుకులూవచ్చి మమ్మల్ని బెదరించి కాయాగ్రటా లాక్కుపోతూవుంటే మాకు అమ్మకానికి యేమివుంటుంది? లాభంయేమివుంటుంది? యేమిటో పూర్వమునుంచీ చేస్తూవున్న వృత్తికావడంచేత విడవలేక యీడ్చుకుని వస్తూవున్నాను. దిక్కుమాలినంత పన్నువున్నది. పన్నే చెల్లక వుస్తే పుడకా తాకట్టుపెట్టి సర్కారుకు బాకీ లేకుండా చెల్లిస్తూ వున్నాము.

పోలి—— నీవు యెప్పుడూ పుచ్చువంకాయలూ చచ్చుబీరకాయలూ కుళ్ళుఅరటిపళ్లూ దుకాణంలో వుంచుతావుగాని మంచివి నీ దుకాణంమీాద యెప్పుడూ కనపడవు.

చంద్ర——మంచిపళ్లూ కాయలూ గుమాస్తాలు ఇనస్పెక్టర్లు బంట్రోతులు ఫదిమందివచ్చి గంపదింపడంతోటే పట్టుకుపోతూవుంటే అమ్మడానికి చచ్చువీ కుళ్ళువీగాక మంచివి యెలాగువుంటవండి బాబూ!

పోలి——అలాకాదు. కూరలూ పళ్లూ నీవు మంచివి తెస్తే మ్యునిసిపల్ వుద్యోగస్థులు అడిగిపోతారని నీవు యెప్పుడూ గంపలో పనికిమాలినవే పెడతావు.

చంద్ర——రామ రామా! అలాచేస్తే పాపంరాదూ బాబూ! మేనేజరుగారు యిప్పుడు ఫదిరూపాయలు తెచ్చుకుంటేనేకాని పన్ను యెక్కువచేయిస్తామంటూవున్నారు. యెవరికయినా అర్జీ యిచ్చుకుంటే కార్యం వుంటుందీబాబూ?

పోలి——నీవు వక్కత్తెవు అర్జీయిచ్చుకోవడంకాదు. ఫదిమంది చేరి మహాజ్జరుచేస్తే కార్యంవుంటుంది. రామిసెట్టిగారూ! యిటువంటి అక్రమాలు జరుగుతూ వున్నప్పుడు మీారందరూ చేరి మహాజ్జరువిషయము యేమయినా ఆలోచించరాదూ?

రామి—వుద్యోగస్థులమీద మహజరు యిచ్చి మనం. యీ వూళ్ళో రెండురోజులు కొంపకట్టుకుని కాపురం చెయ్యలేము. అరుగో మేనేజరుగారు ఆఫీసుకు వెళ్ళడానికి వస్తావున్నారు. మనంఅందరమూ యిక్కడ గుంపుచేరి వుంటే యేదో గూడుపుఠాణీ చేస్తూవున్నామని కొంప తీసివేస్తాడు. ఆయన అసాధ్యుడు. వెళ్ళిపోదాముఠండి.

(అని అందఱును వెళ్ళుచున్నారు.)

ద్వితీయరంగము—మ్యునిసిపల్ ఆఫీసు.

[మొదటిక్లర్కు సుబ్రహ్మణ్యముగారును, రెండవక్లర్కు వెంకయ్యనాయుడు గారును, మూడవక్లర్కు అచ్చయ్యశాస్త్రిగారును ప్రవేశించుచున్నారు.]

సుబ్రి—వెంకయ్యనాయుడుగారూ ! మేనేజరుగారు పన్నెండు ఘంటలయినది యింకా ఆఫీసుకురాలేదు. ఆయన భోజనంచేసి పరుండి వకనిద్రతీసి నిక్కి నీలిగి తమ మనసువచ్చినప్పుడు ఆఫీసుకు వస్తాడు. మనను ప్రొద్దున్నా మధ్యాహ్నమూకూడా వచ్చి పని చెయ్యమని తోమి వేపుకుతింటూవున్నాడు.

వెంక—అవును డబ్బూదస్కమూ వస్తే దొబ్బడము ఆయనా, అడ్డమయిన వెట్టిచాకిరీ చెయ్యడము మనమూను. దొర గుడ్డివాడు గనుక ఆయన ఆడినదల్లాఆటా పాడినదల్లా పాట అయి దినాలు సాగి వస్తూవున్నవి.

అచ్చ—మునుపు తాను ఫదులు పుచ్చుకున్నా నూరులుపుచ్చుకున్నా అడపాదడపా మనచేతులోకూడా రెండురూపాయలు పెట్టేవాడు యిప్పు డవీ యెగపెట్టినాడు.

సుబ్రి—మొన్న టోలుకంట్రాక్టరుకు నాలుగువందల రూపాయలు రిమీషన్ యిప్పించినప్పుడు బెత్తులలాగు నూరురూపాయలు

పొక్కసారి వాళ్ళో పోసుకొన్నాడుగదా ? అందులో సుబ్రహ్మణ్య ముగారూ కూర కొనుక్కోమని వక్కపావలాడబ్బులు చేతులో పెట్టిన పాపాన్ని పోయినాడుటయ్యా? బిళ్ళగుడుములలాగు రూపాయలుచూస్తే నాకన్ను చెదిరిపోయింది.

వెంక—ఆయన యెంతవచ్చినా గళగ్రాహిగా మింగివేస్తూ వుంటే మనము చాటున గుటకలు మింగుతూ కూర్చుంటాము. యేమి ప్రయోజనము? మీకు మగతనం వుంటే యేది మాకుకూడా భాగము యివ్వవలసినది ; యివ్వకపోతే మీరు లంచాలు పుచ్చుకుంటూవున్న సంగతి కమీషనర్లనోటీసులోకి తెస్తామని మీలో యెవరయినా ఘట్టిగా అడగరాదూ ? అసలు మీకు అడగడానికి నోట్లో నాలుక లేదు. పయికిరావడానికి చేతగాక మీరు మూలనుసుగులో కూర్చుండి గుసగుసలాడుతారు.

సుబ్ర——మనం కమీషనర్లతో చెప్పుకోవడానికి అసలు కమీషనర్లకు వకటి దిక్కువున్నదీ ? కొందరు కమీషనర్లను తీసివేయిస్తామని బెదరించి యిది చెయ్యలేదనీ అది చెయ్యలేదనీ ధోరతో చెప్పి చివాట్లు పెట్టిస్తాడు. యింకొందరు కమీషనర్లూ ఈయనా మమేకమే. వారితో కలిసి వందలకు వంకలు కొట్టివేస్తూవున్నాడు. యెక్కడ సబుకమిటీవచ్చినా యీ కమీషనర్లే వుంటారు. యెక్కడ యేమరమ్మతూ యేకొత్తపనులూవచ్చినా యీకమీషనరులే వుంటారు. వెయ్యి యెందుకు ? డబ్బువచ్చేది యేమయినావుంటే యీకమీషనర్లు వుండకుండా వుండరు. కమీషనరులే యీప్రకారంగా పావలాకాడినుంచి లంచాలు పుచ్చుకుని అక్రమాలు చేస్తూవుంటే యిక ప్రజలకు యేమి న్యాయం దొరుకుతుంది ?

అచ్చ——యిటువంటి కమీషనర్లను వెయ్యడం గవర్నమెంటు

వారిది తప్పితం. కమీషనర్లలో యిలాగంటి యేడుపు వుండబట్టే మేనేజరు నిర్భయంగా యిలాగు జుట్టువిరబోసుకుని తిరుగుతూవున్నాడు. కమీషనర్లు శుద్ధంగావుంటే మేనేజరు యీప్రకారంగా ప్రతిదానిలోనూ విచ్చలవిడిగా పుచ్చుకోవడానికి గుండెలు వుంటవండీ? మెజారిటీకి యీలంచగొండి కమీషనరులే విస్తారంగా వున్నారు. వారు భోరున వర్షం కురుస్తూవున్నా మీటింగుకు రావడం మానరు. యింగ్లీషువచ్చిన యిద్దరుముగ్గురు కమీషనర్లకుమాత్రం యీయన కొంచెం విధేయతగా వుండి పయికి మహాభృత్యుడులాగు నటిస్తాడు. వారప్పుడప్పుడు మీటింగులోకివచ్చి తమకు తోచింది యేమిటో చెప్పిపోవడం తప్ప యెందులోనూ జోక్యం కలుగజేసుకోక యేది యెలాగయినా సరే వూరుకుంటారు.

సుబ్ర——వెంకయ్యనాయుడుగారూ! పూర్వం పిటీషన్ యెండార్సుమెంట్లమీద వచ్చేమామూలు మీకు వదిలిపెట్టేవారు కాదండీ?

వెంక——అది యెంతండీ? నెలకు నాలుగురూపాయ లయినా తిన్నగా వచ్చేవి కావు. జరూరయినపిటీషన్ వుంటే పావలా మామూలు యిచ్చి యిండార్సుమెంటు వేగిరం పట్టుకువెళుతారు. శెలవు యివ్వ వల్లకాదని వేసినఆర్డరులకు యెంతకాలం వుంచినా వచ్చి యిండార్సుమెంట్లే పట్టుకువెళ్ళరు. ఆబిచ్చపురూపాయలు నాలుగూకూడా యీనాడాదినుంచి నాకు యివ్వకుండా ఆమహానుభావుడే కాజేస్తూ వున్నాడు. ఆమహద్భాగ్యమంతా ఆయనసే బావుకుని పెద్దకాపురం చెయ్యనియ్యండి. నేను అంతటితో చెడిపోను. నా అదృష్టం బాగావుంటే బేడబేడకాడినుంచీ ఆయనే చెయ్యి చాపుతూవున్నా నేను యేచాటునో నాలుగురూపాయలు యేరుకోలేకపోను.

అచ్చ——మీరంటే మొదటినుంచీ వున్నారు. యేమూలంగా

నయినా నాలుగురాళ్లు లాగులాడుతారు. యెందుకూ పనికిరాకుండా వున్న వట్టినిరర్థకుణ్ని నేనువక్కణ్ని కనపడుతూవున్నాను. పోనియ్యండి. నాకు దైవమిచ్చినది యీ ఫదిరాళ్లే చాలును. మేనేజరుగారికి బాగా దొరికేది యెందులో నండీ?

సుబ్రి—చరదానిలో యేమిటి? అన్నింటిలోనూ దొరుకుతుంది. రోడ్డుకంట్రాక్టులో సగానికిసగంలాభం వున్నది. అందులో కమీషనర్లు సగమూ యీయన సగమూ కడితేరుస్తారు. యిటుకగోడలు ప్రియ వేటుగా చేయిస్తే గజానికి రెండురూపాయలకంటె యెక్కువ కావు. యిప్పుడు వీరు నాలుగురూపాయల రేటు వేసి సఖం కాజేస్తూవున్నారు. కంట్రాక్టర్లకందరికీ లోపాయకారీని యీకమీషనర్లతోనూ మేనేజరుతోనూ భాగం వుంటుంది గనుక అంతా కట్టుకట్టి రేట్లు తగ్గించరు. యెవరయినా తగ్గిస్తామని వస్తే వాణ్ని నానాచిక్కులూ పెట్టి సొమ్ము యివ్వక పని బాగాలేదని నాలుగుమాట్లు పెట్టినగోడలు తీయించీ వేసినరోడ్డు తవ్వించీ దండుగ తెప్పించి యెప్పుడూ పోటీకి రాకుండా హడిలిపోయేటట్టు చేస్తారు. యీవిధమయినరశ్మి రోడ్లమరమ్మతులోనూ చెరువులూ కాలవలూ బాగుచేయించడములోనూ గట్లు పోయించడంలోనూ యీబాపతుపను లన్నిటిలోనూ వుంటుంది. కొత్తగా స్థలాలు యివ్వడంలో మరీలాభం వుంటుంది. ఖాలీగావున్న సర్కారుస్థలాలు తమవని యెవరిచేతనో పిటీషను పెట్టించి వాటికిచుట్టూ గోడ పెట్టుకోవడానికి సెలవు యివ్వవచ్చునని తనకు యిష్టులైన యిద్దరుకమీషనర్లచేత వ్రాయించి యేసందడిలోనో ధోరచేత దానిమీద గీటుపెట్టించి ఫదులూ యిరవయిలూ పుచ్చుకుంటారు. కొందరికి యెంతోకాలం నుంచి పన్ను కట్టకుండానే అట్టేవుంచి లోపాయకారీని యేమో పుచ్చుకుని దొంగను తేలుకుట్టినట్టు యేమీ యెరగనివానివలె వూరుకుంటారు. పన్నులు

యివ్వనివారిని యేమైనా పుచ్చుకుని యేళ్లకొద్ది ప్రోసిక్యూషన్ చెయ్యకుండా వూరుకుండి యెప్పుడో రానిబాకీలకింద చేర్చి కొట్టివేయిస్తారు. అప్పీళ్ళలో వీరందరూ చేరి లంచాలు పుచ్చుకొని పన్ను తగ్గిస్తారు. వక దానిలోయేమిటి? ఆఖరుకు చచ్చు స్కూలుమాష్టర్లవద్ద రిజల్టుగ్రాంటులోకూడా నూటికి పదిరూపాయలు చొప్పున కమీషన్ పుచ్చుకోనిదీ సొమ్ము యివ్వరు. దీపాలకంట్రాక్టరువద్ద నెలకు యింతని మామూలు పుచ్చుకోవడమే కాకుండా యింటికి కావలసిన చమురంతా వాడిదగ్గిర పుచ్చుకుంటారు. యిఖ కమీషనర్లతో సంబంధము లేకుండా యీయన స్వంతంగా కడితేర్చేవి యిటికామలూ పెంకామలూ పెళ్ళిపందిళ్ళూ మొదలయినవాటి బాపతు కావలసినంత వుంటుంది. యెన్ని పందిళ్ళు వేసినారో యెన్ని యిటుకామలు కాల్చినారో యెంతసొమ్ము వచ్చినదో కనుక్కునేవారు యెవరు? ఈయన దంగుతలచి చిత్తాను యెంత జమకడితే అంత.

అచ్చ—యీఅన్నిబాపతులూ నెలకు నూరురూపాయలు గిడతవండీ?

సుబ్ర—ఆ! నూరురూపాయలు మేనేజరుగారికి ముట్టవచ్చును.

వెంక—యెక్కడ నూరురూపాయలండీ? నూటయాభయికి యెక్కువముడుతవిగాని తక్కువ ముట్టవు. యీబాపతులన్నీ నాచేతికి యిస్తే నూటయాభయికాడికి యివ్వడానికి నేను నాలుగు సంవత్సరాలికి కంట్రాక్టు వ్రాయిస్తాను. అదుగో బడేసాహేబు మేనేజరుగారి పెట్టె తీసుకుని వస్తూవున్నాడు. మనం నోరెత్తుకుంటే వెళ్ళి ఆయనతో రిపోర్టు చేస్తాడు. దస్త్రాలు విప్పి యిఖ మీరు పని చూచుకుంటూ వుండండి.

తృతీయరంగము—లక్ష్మీనారాయణగారి యిల్లు

[కమీషనర్లు లక్ష్మీనారాయణగారును, బుచ్చయ్యపంతులుగారును, గున్నయ్య నాయుడుగారును, ఖాదర్ సాహేబుగారును, మేనేజరుగారును ప్రవేశించుచున్నారు.]

లక్ష్మీ—ఏమండీ మేనేజరుగారూ! మొన్న పడమటిరోడ్డులో కొట్టించిన యెండుచెట్ల కఱ్ఱలన్నీ మీలోపల వేయించుకోవడమేనా మాకు యేమయినా నాలుగు కావిళ్లకఱ్ఱలు పంపించడం వున్నదా?

మేనే— ముష్టికఱ్ఱలు అవి యేమికఱ్ఱలండీ? అన్నీ బాడిదె చెక్కలూ మఱ్ఱికఱ్ఱలూ రావికఱ్ఱలూను. వూరికే పొగరావడమేకాని యేమీరామండవు. అవి బంట్రోతువాళ్ళు తలానాలుగుమోపులూ పట్టించుకుని వెళ్ళినారు. మీరు కావలిస్తే పల్లపువీధిలోవున్న రెండు చింత చెట్లూ కొట్టించుకొనిపొండి. యిందులో శానిటరీ యినస్పెక్టరుకు పదిమోపులకఱ్ఱలు పంపిస్తేనేకాని వూరుకుండడు.

లక్ష్మీ — దానిముండామోసినకఱ్ఱలు ఆలాగే పంపింతాము. రేపు దీపాలకంట్రాక్టరుతాలూకు పదిమంది చాకలవాళ్ళనూ పిలిపించి సాయంత్రానికల్లా రెండుచెట్లూ కొట్టించివేసి పలచని పేళ్ళుగా చూచి పదికావిళ్ళచెక్కలు మాయింట్లో వేయించి వీరి కందరికీ తలా నాలుగు కావిళ్ళు పంపించండి. కఱ్ఱలు జాయాపోకుండా డివిజన్ బంట్రోతులను నలుగురినీ దగ్గిర వుండి కొట్టించు మని వుత్తరవు చేయించండి.

మేనే — వాళ్లంతా మహా పొగరెక్కి వున్నారు. మనమాటంటే బొత్తిగా లక్ష్యం లేదు. మనం యేదయినాపని చెపితే యీపనీ ఆపనీ వున్నదని వూరికే సాకులు చెపుతారు.

లక్ష్మీ—వాళ్ళకు వెయ్యిపనులు వున్నా అవి అన్నీ కట్టివేసి

ముందుగా యీపని చెయ్యమని గట్టిగా తాఖీదు చెయ్యండి. కమీషనర్ల పనికంటె తక్కినపనులు యెక్కువండీ ? వాళ్ళు మనం చెప్పినపని చెయ్యకపోతే నాతో చెప్పండి. వాళ్ళు తమ నవుకరీలో తిన్నగా పని చెయ్యడం లేదని రిపోర్టుపెట్టి వాళ్లను వక్కసారి తీయించి వేస్తాను. అక్కడితో వాళ్ళ రోగం కుదిరి యీలాగంటితిరుగబాటు చెయ్యకుండా అందరికీ బుద్ధి వస్తుంది.

మేనే—అలాగంటిపని చెయ్యడానికి మీలో చేరిక వుండవలెను. మళ్ళీ వాళ్ళు వచ్చి నాలుగురోజులు మీ యింటిచుట్టూ తిరిగి కాళ్ళా కడుపులూ పట్టుకోవడంతోటే మొఖమాటపడుతారు. యేదీ యిప్పుడు గంగులమీద రిపోర్టు పెట్టి రేపటిమీటింగులో అతనిపని తీయించి వెయ్యండి మీశక్తి చూతాము.

లక్ష్మి—దానిమాట తరువాతచూచుకుందాముగాని ముందుగా మనం వచ్చినపని కానియ్యండి.

మేనే—మీ రందరూ నాకు యెందుకు వర్తమానం పంపించి నారో సెలవియ్యండి.

లక్ష్మి—చల్లకివచ్చి ముంత దాచడం యెందుకు ? బుచ్చయ్య పంతులుగారూ ! మొఖమాటము మాని మీ రంతా నాతో సెలవిచ్చిన సంగతి మేనేజరుగారితో చెప్పండి.

బుచ్చ—మీరే చెప్పండి.

లక్ష్మి—యెవరు చెప్పినా వకటే మీరే సెలవియ్యండి.

బుచ్చ — అలా కాదు మా అందరితరపునా మీరే సెలవియ్యండి. మే మందరమూ మిమ్మలిని కోరినాము.

లక్ష్మి—అలాగయితేవినండి. యిప్పుడు మనకు వచ్చినలాభంలో నాలుగోవంతు మేనేజరుగారున్ను మూడువంతులు తక్కిన కమీషన

ర్లన్నూ పుచ్చుకుంటూ వుండడంచేత సగటుమీద మేనేజరుగారికి యెక్కువా కమీషనర్లకు తక్కువా ముడుతూవుం దని వీరంతా చెపుతూ వున్నారు. యేకమీషనరు చేయించేపనిలో వారి వారి కొక్కరికే ముడుతూ వుండడమూ మీ కందరికమీషనర్ల దానిలోనూ కూడా నాలుగోభాగము వుండడమూచేత మీకు మా అందరికంటెనూ మీధా యెక్కువవుంది అనడానికి సందేహం లేదు. కమీషనర్లకంటె మ్యునిసిపల్ నవుకర్లకు యెక్కువముట్టడం నాకూ న్యాయంగా కనపడడం లేదు. మేనేజరుగారూ! మీాపక్షంగా మాట్లాడుకోక యిందులో యిప్పుడు జరుగుతూవున్నపద్ధతి న్యాయంగా వున్నదేమో మీారే సెల వియ్యండి.

మేనే—అయితే యిప్పుడు మీా రనేమాట యేమిటో స్పష్టంగా సెలవియ్యండి. మీారనేమాటకు నాకు అర్థం కావడం లేదు.

లక్ష్మీ—మే మనేది మరి యేమీా లేదు. మీాకు యెక్కువగా ముడుతూ వున్నది గనుక నాలుగోవంతు మానివేసి ప్రతిదానిలోనూ మీారు ఎనిమిదోవంతు పుచ్చుకోవడం న్యాయమని మా అభిప్రాయము.

మేనే—యెవరిపుణ్యం బాగా వుంటే వారికి యెక్కువ దొరుకుతుంది. అందుకు మనం యేమి చేస్తాము? మీాకు యెక్కువదొరికితే మీారు పుచ్చుకోండి. నాకు భాగం లేకుండా మీాకు దొరికేబాపతులు యెన్నివున్నవి? ధొరదగ్గిర సముజాయిషీ చెప్పి అన్నీ ప్యాసుచేయించడం డ్యూటీ నాది గనుక నాకు యెక్కువ దొరకడం న్యాయమే. అందులో యేమయినా అవకతవక జరిగితే తంటా ధొరకు వస్తుందా మీాలో యెవరికయినా వస్తుందా? ధొరకు మాటవచ్చినప్పుడు యిలాయెందుకు చేసినా వని ధొర నన్ను అడుగుతాడా మిమ్మల్ని అడుగుతాడా? జవాబుదారీపని అంతా నాది, యిందులో మీారేమీా ఆశ పడకండి

నేను ధోరతో తిన్నగా సరిది చెప్పకపోతే మీకు వక దమ్మిడీ దొరకదు.

లక్ష్మి — అవి యేమి మాటలయ్యా! మాకు దొరక్కపోతే మీకుమాత్రం దొరుకుతుందా యేమిటి? ఆ బెదిరింపులన్నీ కట్టిపెట్టండి. నిజం దాచివేసి మీరు యిచ్చేతప్పుసముజాయిషీ అంతా మీడబ్బు కోసం యిస్తారుగాని మామీద దయచేత యివ్వరు. మ్యునిసిపల్ నవుకర్ల జీతాలలోనూ యిటుకామలలోనూ పెంకామలలోనూ సున్నపుబట్టీలలోనూ యింకా యిటువంటి లక్షబాపతులలో మీరు మాకు యేమీ యివ్వడం లేకుండా అంతా కడ తేర్చడంలేదూ?

మేనే — బిచ్చపుసొమ్ము అదెంత? మహాదొరికితే ఫది రూపాయలు దొరుకుతవి; యిరవయిరూపాయలు దొరుకుతవి. మీకు మల్లే వందలూ నూర్లూ కడితేర్చడం లేదుగదా? నూకాలమ్మ చెరువు బాగుచేయిస్తామని నూరురూపాయలు పుచ్చుకొని దానిలో వక్క దమ్మిడీ ఖర్చుపెట్టక అంతా కడితేర్చివేసినారు గదా? మీరు చేసినదల్లా మీగోడలు పెట్టించుకోవడానికి యెక్కడా మన్ను దొరకక యీ మిష మీద చెరువులో గొయ్యిపెట్టించి మీకు కావలసినమన్ను తవ్వించుకొని పోయినారు. సత్రిపుయింటికి వెల్ల వేయించడానికి నూరురూపాయలు వాళ్ళో పోయించుకున్నారు గదా? అందులో యిరవయిరూపాయల కంటె యెక్కువ ఖర్చుపెట్టినారేమో చెప్పండి. రహదారీబంగాళా తిరగవేయించడానికి నూటయాభయిరూపాయలు శాంక్షన్ చేయించి పుచ్చుకొన్నారు గదా. అందులో నీరు యెన్నోవంతు ఖర్చు పెట్టినారు? క్రిమప్రికారంగా రేట్లు వేసి యిష్టిమెంటు పుచ్చుకొని పని జరిగిన తరువాత పని తెలిసినవారిని యెవరినయినా తనిఖీ చెయ్యమంటే మీ మీపస అంతా బయుల పడుతుంది. యిటువంటి రంకులు మీవి. లక్ష నాకు తెలుసును. మర్మమంతా నాచేతులో వున్నప్పుడు నావద్ద గడుసు

తనవుమాటలు • చెప్పకండి. పిటీషనర్లూ మీరూ యేకమయి సర్కారు స్థలాలూ బేవరసుస్థలాలూ దొబ్బివేసినవి యెన్ని వున్నవి ? అవన్నీ షయికి కెక్కరిస్తే మీ రందరూ వక్కసారి అగ్రిహారప్రివేశం కావలసి వస్తుంది. తాబేదారుగా వుండి ధొర చెప్పినపనల్లా చేసేవాడికి యిందులో నాకు యేమిజవాబుదారీ వుంటుంది ? పోతే మీరుపోతారు వారు పోతారుగాని నాకు యేమీ ఫర్వా లేదు. యెక్కడనైనా పిల్ల గండమూ తల్లిగండమూ వుంటుందిగాని మంత్రిసానిగండము యెక్కడా వుండదు.

లక్ష్మి—పోనియ్యండి. మేనేజరుగారూ వూరుకోండి. మీ అభిప్రాయం యెలాగు వుంటుందో అని మేము వూరికే పరియాచకాని కన్నాముగాని మీవద్ద మేము సొమ్ము యెక్కువ పుచ్చుకోవడాని కనలేదు. మీరు యిలాగు అనక అలాగే యెనిమిదోవంతే నాకిచ్చి తక్కినదంతా మీరే పుచ్చుకోమంటేమాత్రము మేము పుచ్చుకుంటా మండీ ? మీరు మాఅభిప్రాయం కనిపెట్టడానికయినా వప్పుకుని మాట దక్కించుకున్నారు కారుగద ? వూరికే కాలహరణ మవుతూ వున్నది. ముందు జరగవలసినమాట చెప్పండి.

మేనే—అది యే విషయమో మీరే చెప్పండి.

లక్ష్మి—సంవత్సరం ఆఖరు గనుక యిప్పుడు యిళ్ళపన్నులూ వృత్తిపన్నులూ లయిసెన్సుపన్నులూ కొత్తగా కట్టడానికి వున్నవి. రివైజు చెయ్యడానికి సమయం వచ్చింది. యిందులో మనకు బోలెడు సొమ్ము దొరుకుతుంది. తరువాత అప్పీళ్ళల్లో కావలసినంతసొమ్ము వస్తుంది. రిమీషనర్ల జాబితా తయారు చేయించడంలో కావలసినంత సొమ్ము రాబట్టవచ్చును. యింకా యెన్నెన్నో వున్నవి. మేము యిప్పుడు వూరికే మీమనసు కనిపెడదా మని వేళాకోళాని కన్న

మాటలు నిజంగా పట్టుకొని వూరుకుంటే మీకూ మాకూకూడా నష్టం వస్తుంది. కాబట్టి మనమంతా చురుకుగా పని చెయ్యావలెను.

మేనే.—ఇప్పుడు నేను ధొరగారియింటికివెళ్ళి జరూరుగా సముజాయిషీ యివ్వావలసిన పని వున్నది. యీసంగతులు తరువాత నిమ్మళంగా మాట్లాడుకోవచ్చునులెండి. నాకు కష్టం మహామెక్కువగా వున్నది. కష్టానికి తగిన రాబడిలేదు. యిందులో మీరు నాకు సఖంవంతు వదలి పెడితేనేకాని సరిపడదు. మీరే ఆలోచించండి. నేను యిప్పుడు వెళుతాను.

(అని వెళ్ళుచున్నాఁడు.)

తృతీయాంకము.

ప్రథమరంగము—గోవింద రాజులు గారియిల్లు.

[శానిటురీఇన స్పెక్టరును, బంట్రోతు మల్లయ్యాయును, ఒవర్సీయరు రంగయ్యాయు, గోవిందరాజుగారును ప్రవేశించుచున్నారు.]

శాని — గోవిందరాజుగారూ! మీరు సర్కారు వుత్తరవు లేకుండా అరుగులూ గోడా కట్టించుకుంటూవున్నారు. పని ఆపుచేయించండి.

గోవిం — లేదండీ. ఇదుగో నేను యిండార్సుమెంటు పుచ్చుకొని మరీ పని ఆరంభం చేసినాను. ఈ యిండార్సుమెంటుకోసం పదిరోజులు మేనేజరు యింటిచుట్టూ తిరిగి అనుసరించి యెక్కడకూ టికాణా లేకపోతే ఇలాగంటితంటాలు వచ్చిపోతవనే రెండురూపాయలు సమర్పించి మేనేజరుగారిని పంపించి ధొరగారిచేత వెంటనే ఆర్డరు వేయించి నిముషాలమీద వ్రాయించి ఇండార్సుమెంటు పట్టుకుని మరీవచ్చి

నాను. కావలిస్తే ఇండార్సుమెంటు చూడండి.

శాని—చూడవక్కరలేదు. దానిలో మీస్థలంలో గోడా అరుగులూ పెట్టించుకోమని వుంటుందికాని అంతకంటె మరేమీ వుండదు. మీరు సర్కారుస్థలం ఆక్రమించుకున్నారు. పని నిలుపు చేయించండి. మల్లయ్యా! కూలివాళ్ళను పని మానివెయ్యమని చెప్పు.

గోవిం—లేదండీ మేము సర్కారుస్థలం వక్క అంగుళమయినా కలుపుకోలేదు. యివిగో యింకా మాపాతహద్దులు కనపడుతూనేవున్నవి చూడండి. వీధివిశాలంగా వుండవలెనని మా స్థలమే అరగజం వదలిపెట్టి అరుగులు లోపలికి జరుపుకొని పెట్టిస్తూవున్నాము. మాకు యివతలపక్కనూ అవతలపక్కనూవున్న అరుగులు యెంత ముందుకున్నవో చూడండి.

శాని—మాకు అదంతా తెలియదు. మీఅరుగులు మునుపు యింకా లోపలికి వుండేవి. మీరు చూపించే పాతఆనవాళ్ళు మీరు యెప్పుడో మట్టివేసి పెంచినవికాని నిజమయినవికావు.

గోవిం—స్పష్టంగా కనపడుతూవున్న గోడముక్కలు నిజమయినవికావు! యే ఆనవాళ్లూ లేనిదీ అందరిస్థలముకంటెనూ ముందుకు జరుపుకొని నెల్లాళ్ల క్రిందట వీధిమీదికి తోసుకువచ్చేలాగు పెట్టుకున్న ఆకొత్తఅరుగులు సర్కారుస్థలం కలియకుండా కట్టుకున్న నిజమయినవా? మాదానిలో నిజమయినదానికి ఇంత తంటాలు పెడుతూవున్నారు. నిజమయిన ఆక్రమణం యిలాగు స్పష్టంగా కనపడుతూ వుంటే యీవెంకట్రావుగారి అరుగులవిషయంలో యేమీ తగాదా పెట్టక మీరు యెందుకు వూరుకున్నారండీ?

శాని—ఇటువంటి బేజరూరువాళ్ళు వెయ్యక యితరుల మాట వదలిపెట్టి మీమాట మీరు చూచుకోండి. వెంకట్రావుగారు

సర్కారుస్థలం యేమీ కలుపుకోలేదు. బాగా యెరుగుదుము. మీరు మళ్ళీ మాట్లాడక తక్షణం పని ఆపుచేయించండి. తరువాతమాట చూచుకుందాము.

గోవిం —— ఆరుగురు మేస్త్రీల్లూ ఇరువదిమంది కూలివాళ్ళూ ఇంతమంది పనిచేస్తూవుంటే యీపని మానిపించి యీరోజుకూలి ఆరురూపాయలూ దండుగపెట్టుకుని వూరుకోనండీ ? న్యాయం బహు బాగావున్నది ?

శాని——యెవరికోసం వూరుకుంటారు ? సర్కారుస్థలం ఆక్రమించుకున్నందుకు దక్కిస్తూ వూరుకోవలెను. ఆరురూపాయలుకాక పోతే ఫదిరూపాయలూ దండుగ వస్తుంది. ఇందుకు యెవరు జవాబుదారీ చేస్తారు ? మీరు పని ఆపకపోయినట్టయితే తిరుగుబాటు నేరం కింద శిక్షఅవుతుంది సుమండీ. ముందుగాచెప్పినాను జాగ్రత్త.

గోవిం——మీరు నామనవి చిత్తగించి కావలిస్తే చుట్టుపట్ల వారిని విచారించి న్యాయం దయచేయించవలెను. ఇప్పుడు పని నిలుపయితే నాకు చాలా దండుగ వస్తుంది. వర్షాకాలం దగ్గరకు వచ్చింది. వక్కసారి వర్షం కురిసిందంటే యీ చేయించిన పనంతా వ్యర్థమయిపోతుంది. మీరు యెలాగయినా కటాక్షించవలెను.

శాని——కటాక్షించడం గిటాక్షించడం నాకు యేమీ తెలియదు. సర్కారుసొమ్ము తింటూవున్నందుకు మేము న్యాయంగా పని చేయవలెను. మీస్థలంవిషయము మాకంటె చుట్టుపట్లవాళ్ళకు మహా యెక్కువ తెలుసునా యేమిటి ? యీ వూళ్ళోస్థలాలవిషయము మాకు తెలిసినట్టు మరియెవరికీ తెలియదు. రంగయ్యా ! మనకు మాటలతో ప్రయోజనంయేమి? వీరిపేర్లు వ్రాసుకో. తరువాత మేజస్ట్రీటువద్ద ప్రాసిక్యూటుచేతాము. మీరు మామాటవినకుండా నిర్లక్ష్యం

చేసి అరుగులు పెట్టినట్టయితే మీకు జనుమానాపడడమే కాకుండా అరుగులూ గోడా తవ్వించి పడగొట్టివేయిస్తాము సుమండీ. (అని పది బారలునడిచి ' మల్లయ్యా ' అని పిలుచుచున్నాఁడు.)

మల్ల—చిత్తము. వస్తావున్నానండి. —గోవిందరాజుగారూ ? ఆయన రిపోర్టుచేస్తే మీకు చెడ్డతంటా వస్తుంది. ఆయనతోకూడా వెళ్ళి మాట్లాడుకుని నాలుగురూపాయలసొమ్ము చేతులో పెడితే యేతంటా లేకుండా సరిపోతుంది. అలాచెయ్యండి.

గోవిం—అయ్యా ! ఇనస్పెక్టరుగారు ! నేను వస్తానేవున్నాను మనవండి. ఒక్కనిమిషం దయచెయ్యవలెను.

(అని పరుగెత్తుచున్నాఁడు.)

శాని—ఏమయ్యా ఇంతలోకే మళ్ళీ యేమి మనవి వచ్చింది ! మాకు అవతల చాలాపని వున్నది. వెళ్ళవలెను. వేగిరం చెప్పివెయ్యండి.

గోవిం — తమకు యేమైనా ఇచ్చుకుంటాను. అభ్యంతరం చెప్పక పని జరిగించుకోవడానికి సెలవిప్పించండి.

శాని — ఇంత గందరగోళం జరిగించకపోతే చాటుకు పిలిచి ఆమాటే మొట్టమొదట నాతో చెప్పరాకపోయిందీ ? న్యాయమైతే మాత్రము మాతో మాట్లాడి మమ్మలిని సమాధానపరచకపోతే పని సాగుతుందీ? మేనేజరు తానుమాత్రం దొబ్బి మాకు యేమీ లేకుండా చెయ్యవలె ననుకొన్నాడూ? అతను మిమ్మలిని బుట్టలోపెడితే మేము లోకమందరినీ బుట్టలో పెట్టినవాళ్ళము. తెల్లవారి లేస్తే మాకు యిదే పని. మీరుమమ్మల్ని మోసం చెయ్యగల రండీ? యేకమీషనర్లు శాంక్షన్ యిచ్చినా, యేమి చేసినా వారితో యేమీ లేదు. పని అంతా మాతో వున్నది. మాచేతులో పడేది పడకపోతే ఫదిగజాలు తమస్థలం వదిలిపెట్టినా కిందా మీదా పెట్టి యేవో చిక్కులు పెట్టి పనిజరగకుండా

ఆటంకపెడుతాము. మాచేతులో పడేది పడ్డటయితే నాలుగుగజాలు వీధి కలుపుకున్నా చూచీచూడనట్టు వూరుకుంటాము. కమిషనర్లకు అర్జీ అయినా లేకుండా వూళ్ళో యెన్నిస్థలాలు మేము అరుగులు పెట్టుకోవడానికి ఇచ్చివేసినాము. యెవరైనా తగాదాకువస్తే యీ అరుగులు పూర్వమే వున్నవి అంటాము. మీపొరుగువాడు వెంకట్రావు గారికి అరుగులకింద రెండుగజాలస్థలం ఇంటిపొడుగునా నేను ఇచ్చినాను. యెవరు యేమిచేసినారు? ఇక్కడికే చాలపొద్దు యెక్కింది. జాప్యం చెయ్యక ఇందులో మీరు యేమి యిస్తారో చటపట చెప్పివెయ్యండి.

గోవిం——నాలుగురూపాయలు ఇస్తాను. తమరు మళ్ళీ యేమీ సెలవియ్యక వప్పుకోవలెను.

శాని——ఇందులో పదిరూపాయలకు తక్కువపుచ్చుకోవలసినది కాదు. అయినాకానీ మీరూ మేమూ వక్కవూళ్ళో వున్నాము. తెల్లవారిలేస్తే అనేకపనులు వస్తూవుంటవి గనుక అందుకే వప్పుకున్నాను. మరిగత్తె ఇందులో నేను మీకు చేసినలాభంమాట యెప్పుడూ మరిచిపోకూడదు సుమండీ ?

గోవిం——చిత్తము. నేను యెప్పుడూ అలా మరిచిపోయేవాణ్ని కాను. సెలవు పుచ్చుకుంటాను.

శాని——మంచిది. వెళ్ళి రూపాయలు మల్లయ్యచేత పంపించి మీపని మీరు యథాప్రకారంజరిగించుకుంటూ వుండండి. బంట్రోతుల మామూలుమాట అందరికీ తెలిసిందే. నలుగురికీ నాలుగుపావలాలు రూపాయకూడా మల్లయ్యచేతి కివ్వండి పొండి.—మల్లయ్యా ! పంతులు గారితో వెళ్ళి మళ్ళీ మమ్మల్ని వీధిచివరను వేగిరం కలుసుకో.

మల్ల——చిత్తము. (అని రూపాయలు పుచ్చుకొని వచ్చి కలిసికొనుచున్నాఁడు.)

శాని — మల్లయ్యా! వూళ్ళో యేవీధిని యెవరు గోడలూ అరుగులూ పెట్టుకుంటూవున్నా తక్షణం వచ్చి మాకు రిపోర్టు చెయ్యి. మనకు యేమయినా విశేషంగా లాభిస్తే ఇందులోనే. ప్రతివీధీ ప్రతిగల్లీ తప్పకుండా తిరిగి యెక్కడ యెవరు కాస్తగోడ కదిపినా తక్షణం మా జాహిరులోకి తీసుకురావలసిన దని బంట్రోతు లందరితోనూ చెప్పు. ఇప్పుడు చాలా యెండ యెక్కింది. మేము రాలేము. నీవు సోమవారపు పేటలోకి వెళ్ళి పెళ్ళిపందిరిగలకలు తవ్వకుండ ఆటంకపెట్టు. పెళ్ళి పందిళ్ళకు యిండార్సుమెంట్లు పెళ్ళి అయిన కొన్నిదినాలకు కాని సాధారణంగా రావు. వారు రూపాయి చేతిలో పడవేసినట్టయితే అభ్యంతరం పెట్టక పందిరి వేసుకోనిచ్చి రూపాయి మాఇంటికి తీసుకుని వచ్చి యియ్యి.

మల్ల — చిత్తము. బుచ్చయ్యఅరుగులు తీయించి వెయ్యవలసిన దని కమీషనర్లు వుత్తరవు చేసినా రట. నాలుగురూపాయలూ యిచ్చుకొన్నా యింతే అయిం దని మహాయేడుస్తూవున్నాడు. నిన్న తమదర్శనానికివస్తే బసలో లేకపోయినారట.

శాని — అతనితో ఫర్వాలేదని చెప్పు. కమీషనర్లు వుత్తరువు యిస్తే అమలు జరిగించేవాళ్ళము మేముకాని వాళ్లు కాదు. వూళ్ళో యిలాగంటివి లక్ష అమలు జరిగించకుండా మేము వదిలి పెట్టినాము. నీవు వెంటనే మాయింటికిరావలెను సుమా! మాదొడ్లో పందిరి వెయ్యవలెను.

మల్ల — వైసుప్రెసిడెంటుగారు నిన్నసాయంకాలమువచ్చి పడమటి వీధి చూచి అది మహాకశ్మలంగా వున్నది యీరోజున నన్ను దగ్గర వుండి తుడిపించ మన్నారు. ఆపని చేయించవద్దండీ ?

శాని — వెధవపని అందులో దొరికేదీ పెట్టేదీ యేమైనా

వున్నదా? మాట్లాడక కూరుకో. ఇంతట్లో ధారగారు మళ్ళీ వచ్చి ఆవీధి చూడరు. వకవేళ చూచినా వకమాటు తుడిపించినా వీధివాళ్ళు మళ్ళా ఖరారా చేసినారని చెప్పవచ్చును వూరుకో. పాదుతీగెలు పడిపోతూ వున్నవి. మాపందిరి బహుజరూరు. పంది రయ్యేటప్పటికి మధ్యాహ్నం గడ్డి పోగుచేసేవేళ అవుతుంది. నిన్నటి మోపు మహాచిన్నదిగా వున్నది. వక్క ఆవుకే సరిపోయింది కాదు. యీరోజున నీవు స్వంతంగా వెళ్లి పచ్చగడ్డిమోపులవాళ్ళచేత తలామరికాస్తా వేయించి పెద్దమోపు కట్టించి పట్టించుకొని రా. వాళ్ళు తిన్నగా వెయ్యకపోతే వీధిలో పెట్టి అమ్ముతూవున్నారని రేపు వాళ్ళ నందరినీ ప్రాసికూట్యాటు చేతాము. నీవు వెళ్ళి రా. భోజనపువేళ అయింది. మేము యింటికి వెళుతాము. వారముదినముల డయిలీ అట్టే వున్నది. యేదో వకటికల్పించి పూర్తి చేసి రేపటిమీటింగుకు తయారు చెయ్యవలెను.

(అని వెళ్ళుచున్నాడు.)

ద్వితీయరంగము—గోవిందరాజుగారి సావిడి.

[కామిసెట్టియు, గోవిందరాజుగారును, వెంకట్రాజును, గంగయ్యనాయుడును, వ్యాఘ్రపుభానులుగారును, భీమారావుపంతులుగారును, మరికొందఱును ప్రవేశించుచున్నారు.]

కామి—గోవిందరాజుగారూ! యీరోజు మీటింగులో చెయ్య వలసినపని యేమిటి?

గోవిం — మరి యేమీ లేదు. మ్యునిసిపల్ కమీషనర్లను యేర్పరచుకునే అధికారం జనులకు యిప్పించవలసిం దని పన్నులు చెల్లించేవా రందరూ దస్కతులు చేసి గవర్నమెంటుకు మన గ్రామం నుంచి మహజరు పంపించడానికి. ఈమ్యునిసిపాలిటీలో జరుగుతూవున్న

అక్రిమాలన్నీ మీారు చూస్తూవున్నారు గదా ?

కామి — తప్పకుండా మహాజరు పంపించవలెను. ఇప్పుడు కమీాషనర్లు మహా దోచుకుంటూ వున్నారు. నావద్ద—

భీమా—అలాగంటిసంగతులు పదిమందిలోనూ చెప్పకు తంటా వస్తుంది. మనం యీా యిరవయిమందితోనేనా మీాటింగు చెయ్యడం ?

గోవిం—మామనుష్యులను అందరియిళ్ళకూ తిప్పినాను. యెంతో మంది వస్తామని నాతో చెప్పినవాళ్ళే రాలేదు. ఇటువంటివిషయంలో మనవాళ్ళకు శ్రద్ధ లేదు.

గంగ—నాకు తెలియక అడుగుతాను చెప్పండి. యేర్పరుచుకునే అధికారం గవర్నమెంటువారు ప్రజలకుయిస్తే దానివల్ల మనకు పలికే వైకుంఠం యేమిటి ?

గోవిం—మదనయ్యగారూ నాగభూషణరావుగారూ మొద లయినవారివంటి మంచికమీాషనర్లను మనం యేర్పర్చుకోవచ్చును. అటువంటివారు వస్తే అక్రిమాలు యేమీా జరగక అందరికీ న్యాయం దొరుకుతుంది.

వ్యాఘ్రా — అటువంటివారు కమీాషనర్లయితే ప్రజల కేమీా లాభం వుండదు. వాళ్ళకు దేవబ్రాహ్మణభక్తి లేదు. నేను మొన్న యిల్లు కట్టుకుంటూ వీధిఅరుగులకోసం వీధిలోది సర్కారుస్థలం రెండు గజాలు యిప్పించమని బతిమాలుకుంటే తమపుట్టి మునిగిపోయినట్టు వేదం చదువుకున్న బ్రాహ్మణ్ని అని అయినా చూడక వల్లపడదన్నారు.

గోవిం—వీధిలో స్థలాలు కలుపుకుంటే వీధి యిరుకయి బళ్లు వెళ్ళడానికి యిబ్బంది కాదటయ్యా ?

వ్యాఘ్రా—ఏమీా యిబ్బంది లేదు. వూళ్ళో మావీధికంటె యిరుకుసందులు లేవూ? మావీధిలో రెండుబళ్ళు అవ్యాహతంగా వెళ్ళ

డానికి స్థలంవున్నది. నాకు రెండుగజాలుస్థలం యిచ్చినా వక్కబండీ నిరభ్యంతరంగా వెళ్ళవచ్చును. సర్కారుస్థలంగాని వాళ్ళతాతలు సంపాదించినది యేమయినా భూదానం చేస్తారా యేమిటి ?

గోవిం — సర్కారుస్థల మయితేమాత్రం యుక్తాయుక్తామక్కర లేదండీ ?

వ్యాఘ్రా — వాళ్ళ యుక్తాయుక్తాలు యేడిసినట్టే వున్నవి. బ్రాహ్మడికి భూమి యివ్వడంకంటెనూ యుక్తం యేమి వున్నది? అడిగితే నాలుగురూపాయలు వాళ్ళమొఖాన్న పారవెయ్యడానికికూడా నేను సిద్ధపడినాను. వాళ్ళు నాలుగుడబ్బులుసొమ్ము తిని అయినా పరోపకారం చెయ్యడం యెరగరు. వాళ్ళు వట్టి కర్కోటకులు. వాళ్ళు మాట దక్కించుకున్నారు కారుగాని నేను వెళ్ళి బుచ్చయ్యపంతులుగారితో మనవిచేసుకుంటే ఆమహారాజు నావద్ద యేమీ పుచ్చుకోకుండానే గున్నయ్యనాయుడుగారితోనూ సోమిసెట్టిగారితోనూ చెప్పి ఆకిరాతులు వూళ్ళో లేనప్పుడు నాపిటీషన్ మీటింగులో పెట్టించి అరుగులకు శాంక్షన్ యిప్పించినారు. ఎందుకయినా జనుల కష్టనిష్ఠూరాలు తెలిసిన బుచ్చయ్యపంతులుగారివంటి కమీషనర్లు వుంటేనే లాభం వున్నదిగాని దయాదాక్షిణ్యాలు లేని నాగభూషణరావుగారు మొదలయినవారివంటి కర్కోటకులు కమీషనర్లుగా వుంటే ప్రజలకు యేమీ సదుపాయం లేదు.

గోవిం — మీరంటే లాభంపొందినారు గనుక యిలా అంటూ వున్నారుగాని వీధిలో యిటునుంచి వకబండీ అటునుంచి వకబండీ వస్తే యెటువెళ్ళడానికి వల్లకాక యెంత యిబ్బంది కలుగుతుంది ?

వ్యాఘ్రా — బ్రాహ్మణవీధులోనుంచి అసలే బళ్ళు రానియ్యకూడదు. యీ దిక్కుమాలిన బళ్ళరహదారీ మూలంగా మొన్న

కట్టించుకున్న మావీధిఅరుగు లన్నీ వారానికి రెండుసార్లు పడిపోతూ వున్నవి. మెత్తుకోలేక చస్తూవున్నాము మునుపు మావీధిని బళ్ళను గాని మాలవాళ్ళనుగాని నడవనిచ్చేవాళ్ళమయ్యా? మీరు మహా అక్రమాలు అంటారుగాని ఆకమీషనర్లు చేసే అక్రమాలు యేమిటో నాతో చెప్పండి. యెవరివృత్తి యెవరు మానుతారు? లంచం పంచం తినడం వుద్యోగధర్మ మవునా కాదా?

గోవిం—ఇప్పుడు జరుగుతూవున్న అక్రమాలు లక్షలూ కోట్లూ వున్నవి. రోడ్లు మరమ్మతు చెయ్యడానికి సొమ్ము ఖర్చువ్రాసి తిన్నగా బాగుచేయించకుండా అదంతా లోపాయకారీని కంట్రాక్టరులూ తామూ కడితేరుస్తారు. వీధులలో లాంతర్లు వెలిగించడానికి యెంతో చమురు ఖర్చువ్రాయించి లాంతర్లలో తగినంతచమురు పోయించక తమ యిళ్ళవద్దదీపాలలో పోయించుకుంటారు. వీధులలో దీపాలు చమురు లేక పెట్టడంతోటే ఆరిపోయి వీధంతా చీకటిగా వుంటుంది. బీదవాళ్ళు తాటాకుగుడిసెలు వేసుకోవడానికి సెలవియ్యక తంటాలు పెట్టి వాళ్ళను యేడిపించి వాళ్ళవద్ద రూపాయీ అర్ధా పుచ్చుకుంటారు. లేనిపోనివాళ్ళకు వృత్తిపన్నులు——

గంగ—మీమాటకు అడ్డం వస్తాను. ముందుగా నాప్రశ్నకు జవాబు చెప్పండి. ఈఅక్రమా లన్నీ మనం యేర్పరుచుకున్నవాళ్ళే చేస్తే అప్పుడు యేంచేస్తారు?

గోవిం—మనం యేర్పరుచుకున్నవాళ్ళు వక్కసారి అక్రమం చేస్తే రెండోసారి వాళ్ళను మనం మళ్ళీ యేర్పరుచుకోము. ఆభయం చేత వారు జాగ్రతగా ప్రవర్తిస్తారు.

గంగ—మీరు నూరనండి వెయ్యనండి. లంచాలు పుచ్చుకునే కమీషనర్లు వుంటేనే మనకు లాభం. వాళ్ళు నాలుగుడబ్బులు తిన్నా

వుపకారం చేసి మరీ తింటారు. ఏమీ తినకపోతే వూరికే వూరంతా తిరిగి కమీషనరుగా వెట్టిపని చెయ్యడం వారికి కంచిగరుడసేవా యేమిటి ?

వ్యాఘ్రా — మీరు బహుబాగా అడిగినారు. మీతో నేను పూర్తిగా యేకీభవిస్తాను. లంచాలు పుచ్చుకునేవాళ్ళు వుండడమే యెందెందులకూ మంచిది. యిల్లు కట్టుకుని వూళ్లో కాపురం చేసేటప్పుడు నే లోపాలయినా వుంటవి ! యేవుపకారమయినా కావలసివస్తుంది.

వెంక — శాస్త్రుర్లగారు బహు తెలిసినవారు. ఆయన చెప్పినట్టే మేము నడుచుకుంటాము. మీటింగు అక్కర లేదు. వెళ్ళుదాము పదండి.

గోవిం — ఏర్పరచుకునే అధికారం మనచేతులో వుంటే ఆ లంచాలు పుచ్చుకునే కమీషనర్లయినా మనం చెప్పినట్టు వింటారు. మహాజరు తప్పకుండా పంపించవలెను.

వ్యాఘ్రా — మదనయ్యగారినీ నాగభూషణరావుగారినీ యెప్పుడూ కోరకుండా వుండేటట్టయితే నేను మహాజరులో దస్కతు చేస్తాను.

భీమ — మహాజరు తయారుచేయించండి. రేపు మళ్ళీవస్తాము.

(అందఱును లేచిపోవుచున్నారు)

కామరూపమంత్రము

ప్రథమాంకము.

ప్రథమరంగము—జంబుకేశ్వరవర్మగృహము.

[జంబుకేశ్వరవర్మయు, రాజరత్నమును ప్రవేశించుచున్నారు.]

జంబు—నీ వెనుకటిప్రయత్నమును పూర్ణముగా వదిలిపెట్టితివిగదా?

రాజ—మొదలంట విడిచినాను.

జంబు—నీవు నీ తల్లిగర్భములో నుండగానే మన బ్రహ్మసిద్ధాంతి నాకు పుత్రుడు కలుగునని చెప్పినాడు. ఆయన మహా తపశ్శాలి. ఆయన యన్నమాట యమోఘముసుమా!

రాజ—ఆయన తపోమహిమ నాకు తెలియదా? ఆయన చెప్పినజ్యోతిషమును బట్టియే నేను మీ కిటువంటిపుత్రుడను పుట్టినాను.

జంబు—తల్లిపోయిన బిడ్డను నిన్ను బహుకష్టపడి పెంచినాను. నీవు నీ వెఱ్ఱియాలోచనను విడిచిపెట్టబట్టిగాని లేకపోయినయెడల నీ మాతామహార్జిత మైనధనము నపహరించవలెనని నోళ్ళు తెఱచికొని యున్న నీతాతజ్ఞాతు లింతకు ముందే యానందభరితులై పొంగుచుందురుసుమా. ఇంతవఱకును వారి కన్నులను గప్పుట కప్పుటకాదు గాని యిప్పుడు నీసహాయముచేత నిశ్చయముగా వారినోళ్ళలో మన్ను వేసినాను. ధనములో నెంతమహిమ యున్నదనుకున్నావు. "ధనమూలమిదంజగ" త్తన్న వాక్యము నీవు వినలేదా?

రాజ—విన్నాను. మీరన్నది నిజమేకాని సుఖప్రదముగాని

ధనమువలన బ్రయోజన మేమి? ధనమువలన గలుగవలసిన ప్రయోజన మంతయు సుఖమేకదా ? సుఖమునకు భంగము కలిగించునది యానేని అట్టిధనమును విడుచుటయే ధర్మము.

జంబు—నీవింకను ధనముకంటె సుఖమే యెక్కువని యున్నావు. నీ వెనుకటికోరిక నీమనసులో మొదలంట నశింపలేదని తోచుచున్నది.

రాజ—నిజము చెప్పుచున్నాను. ఇప్పటి డాప్రయత్నము నా మనస్సులో లేనేలేదు. ఇప్పుడు నేను పూర్ణముగా క్రొత్తదారికి వచ్చినాను.

జంబు—ఈమాట నీ నోటినుండి విని నాచెవులు చల్లబడినవి. ధనముతో సమానమయినది లోకములో నేదియు లేదు. వేయిసుఖములు పోయినను ధనమును పోగొట్టుకోరాదు. నిత్యమును కన్నుల పండువుగా ధనమును చూచుచుండుసుఖమును మించిన సుఖము మఱియేమున్నది ? సంచులలో గల్లుగల్లుమని రూపాయల మ్రోత వినుచుండుట చెవులపండువు కాదా ? మన క్షత్రియకులమున బుట్టిన వారికి మనకింతయున్నది చాలదా యని ధనవిషయమున తృప్తియుండరాదు. "అసంతుష్టా ద్విజా నష్టా స్సంతుష్టా ఇవ పార్థివా" అని చెప్పిన పూర్వులు వెఱ్ఱివారనుకొన్నావా ?

రాజ—వారు వెఱ్ఱివా రనుకోలేదుగాని నేనుమాత్రము నా యభిప్రాయమును సుఖముకంటె ధన మెక్కువ యన్నయుద్దేశముతో మార్చుకోలేదు.

జంబు—మఱి యేల మార్చుకొన్నావు ?

రాజ—నాసుఖముకంటెను జనకాజ్ఞ నా కెక్కువయినది. యావజ్జీవమును కష్టములకైన నోర్వవలెనుగాని యవిలంఘనీయమైన తండ్రియాజ్ఞను మీఱరాదన్న పితృభక్తిచేత మానుకొన్నాను.

జంబు—నీవన్నది పరిహాసపుమాట కాదుగదా?

రాజ—నామాటయం దంతనమ్మకము లేనియెడల మీాయిష్టము వచ్చినట్లు భావించుకొనుడు.

జంబు — పితాజ్ఞాపరిపాలనమునందు శ్రీరాములను మించిన బిడ్డను గనుటచే నే నిప్పుడు కృతార్థు డయినాను. నీకు కన్యల నిచ్చెద మని యెండలో తిరుగుచున్నను నామనస్సులోని భయముచేత—

రాజ — గతమును గూర్చి విచారించిన ప్రయోజనము లేదు. ముందు జరుగవలసిన పని చూడుడు. సత్రములో దిగియున్న యోగిని మీారాహ్వానము చేసినారా?

జంబు—ఆయన తపస్సంపన్నుడేకదా?

రాజ—మహాతపస్సంపన్నుడు. ఆయన బ్రహ్మతేజమును మీారు చూడలేదా? తపశ్శక్తిచేతనే కాకపోయినపక్షమున, మేలిమి బంగారు నపహసించెడు పసిమిచాయ యాయన కాయమున కెట్లు వచ్చినది? గడ్డమంతయు తెల్లపడినను దేహమున నొక్క ముడుతయైనను లేక పోవుటనుబట్టియైనను మీారా మహాత్ముని తపోమహిమను కని పెట్టలేదా? ఆయన మహా మంత్రసిద్ధుడు.

జంబు—అంతటి మంత్రసిద్ధుడా? ఈకలియుగములో మంత్ర మహిమలు ప్రత్యక్షముగా కనబడునా?

రాజ — ఇటువంటి మహానుభావులవద్దమాత్రము కనబడును. పుత్రులులేనివారికి పుత్రులను కలిగించెడి మహామంత్ర మాయనవద్ద నున్నది. మనుష్యులను కామరూపములనుజేయు దివ్యమంత్ర మాయనకు సిద్ధించినట్లు నేను రహస్యముగా దెలిసికొన్నాను. ఇది పరమరహస్యము. నాకుతప్ప నన్యులకు తెలియదు. నేను కొన్నిదినము లాయన వెంటనుండి స్వీయమంత్రశక్తిచేత నామహామహుడు నిజరూపమును

మార్చుకోగలుగుట నేను మాదోపాయముచేత కనిపెట్టినాను.

జంబు—అమంత్రిమొక్కటి నీయందు ప్రయోగించిన—

రాజ—వేయిమాట లెందుకు? ఆయనను దెచ్చి మనయింట నుంచి నన్ను శిష్యునిగా నుంచితిరా శుశ్రూషచేత నే నాయనను మెప్పించి పూర్వము దూర్వాసునివలన సంతానమంత్రమును కుంతీదేవి గ్రహించినట్లుగా కామరూపమంత్రమును సమగ్రముగా నుపదేశము పొందెదను. అప్పుడుగాని నాశక్తి మీకు దెలియదు.

జంబు— మంత్రప్రభావముచేత స్త్రీలు పురుషులును పురుషులు స్త్రీలును అగుదురా?

రాజ— స్త్రీలను పురుషులనుగాను పురుషులను స్త్రీలనుగాను మార్చుట యేమివింత? ఆయన తలచుకొన్నపక్షమున మీరు చూచు చుండగానే జనులనందఱిని గాడిదలనుగా మార్చగలడు.

జంబు—ఆయద్భుతము నేను చూడవలెను.

రాజ— ఇప్పుడేపోయి ప్రార్థించి మీరాయోగిని మనగృహము నకు తోడ్కొనిరండు. ఆయద్భుతమును మీ రల్పకాలములోనే చూడ గలరు; పొండు.

జంబు—నీవు లోపలిగది యోగిజనులుండుటకు తగినట్లు చేయు చుండుము. నే నింతలో పోయి యోగీంద్రుని ప్రార్థించి తోడుకొని వచ్చెదను.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయరంగము—జంబుకేశ్వరవర్మ గృహములోని గది.

[చిదానంద యోగీశ్వరుఁడును, రాజరత్నమును ప్రవేశించుచున్నారు.]

చిదా—ఓ రాజకులరత్నమా! నీతండ్రి నిత్యమును కామరూపమంత్రమని పలవరించుచున్నాఁడు. ఇన్నినాళ్ళనుండి శుశ్రూష చేయుచున్నావు గదా ? నా కామరూపమంత్రమహిమను నీవు కనిపెట్టినావా ?

రాజ—మీ మహిమను ముందుగా నే నెఱిగియుండబట్టి నేను కనిపెట్టగలిగితినిగాని మీ కామరూపమహిమ నెవ్వరు కనిపెట్టగలరు? మీమహిమ లితరులకు దురూహ్యములు. కుసుమకోమలమైన మీ శ్వేత దేహమున చామరమునుబోలిన యీ ముసలిగడ్డ మెప్పు డెట్లు మొలచినదో యెవ్వరికి గోచర మగును ? ఇట్లు కొన్నిదినములు గాక మీకు నిరంతరసేవచేయు భాగ్యము సంభవించినప్పుడుగదా నేను కృతార్థతబొందుదును!— ఎవ్వరిదో యడుగుల చప్పుడువలె నున్నది. (ఆలకించి) లేదు లేదు. మనస్సులో శంకించుచున్నప్పు డూరక యిట్టి భ్రమ కలుగును.—నిన్న మీ రుపదేశించినమంత్రమును నేను చక్కఁగా గ్రహించినాను. మన మంత్రరహస్య మెవ్వరికిని తెలియ గూడదు. ఇక దానిని ప్రయోగించవలెను. దాని సిద్ధివిషయము నాకు సందేహము లేదు.

[జంబుకేశ్వరవర్మ ప్రవేశించుచున్నాఁడు.]

జంబు—(తనలో) ఈఋషీశ్వరుడు మన రాజరత్నమునకు మంత్రోపదేశము చేసినమాట చెవినిబడి నేను చరితార్థుడ నయినాను. అయినను నేనిది విననట్లు నటించెదను. రాజరత్నముమనస్సు నిజముగానే తిరిగినది. నే నిక నారాయణవర్మవిషయమున భయపడవలసిన పని లేదు. (అనుకొనుచు సమీపించి) స్వామీ! దేవరకు పరిచర్య

చక్కగా జరుగుచున్నదా ?

చిదా—(తనలో) ఇప్పుడు వినబడ్డది యితని అడుగులచప్పుడే. సందేహము లేదు. ఇతడు మా సంభాషణమును వినియుండునుగాని యర్థమును గ్రహింపగలిగి యుండడు. (ప్రకాశముగా) ఇటువంటి యపూర్వ పరిచర్యాసుఖమును మే మిదివఱ కేశిష్యులవలనను బొంది యుండలేదు. ఈయవ్యాజసపర్యకు మాహృదయ మానందించినది. నీమనోరథము శీఘ్రముగానే సఫలము కాగలదు.

జంబు—ఓ మహానుభావా ! సఫలమయినదనియే సెలవిండు. మంత్రోపదేశము చేసితి రన్నశుభవార్త నేను పొంచుండి యిప్పుడు మా రాజరత్నము నోటినుండి విని కృతార్థుడ నయినాను. నేను జేసిన యీయపచారమును మన్నింపవలెను. నారాయణవర్మబాధ విముక్తి చేసి నన్ను బ్రతికించినారు.

చిదా—మీ రాజరత్నమునకు వివాహమహోత్సవము నడుచు వఱకును నారాయణవర్మబాధ విముక్తి యయిన దని సంతోషింప గూడదు. మేము మాశిష్యునకు జేయవలసినయుపదేశమును జేసితిమి. సమర్థముగా నుపదేశించిన మామంత్రప్రభావముచేత సమస్తమును శస్తమగును. ఇటువంటి మంత్రరాజము కరగత మయినప్పుడు పురుషులు స్త్రీలుగా మాఱినను స్త్రీలు పురుషులుగా మాఱినను కడకు మీ రాదిగా జనులందఱును గాడిదలుగా మాఱినను నెవ్వగును నాశ్చర్య పడవలసినపని లేదు. మఱి కొన్నాళ్ళలోనే నీవిన్ని కన్నుల వింతలుచూడగలవు.

జంబు—రాజరత్నముయొక్క మాతామహధనమునకు భంగము రాదుగదా ?

చిదా—రాదు. మే మన్నమాట వరదానమనుకో. నేటి కాఱు నెలలలోపల నీకోడలే నీ వియ్యంకునిజ్ఞాతులకు ప్రత్యక్షముగా జెప్పి

సందేహనివారణం చేసి నిర్వివాదముగా మీరాజరత్నము పుత్రపౌత్ర పారంపర్యముగా ననుభవించునట్లు చేయగలదు. మామాట నమ్ముము. ధనము చెందనర్హులైనవారి కేల చెందకుండును ?

జంబు——(ఆశ్చర్యముతో) ఆఱునెలలలోపలనె నాకు కోడలు వచ్చునా ?

చిదా——మేము యోగదృష్టిచేత సర్వమును జూచినాము. నేటికి నాలవదినము రాత్రి కనకాభరణభూషితురాలయి యొక రాచకన్నియ మీయింటికి రాగలదు. ఆమెను కులగోత్రనామము లడుగక తక్షణమే మీరాజరత్నమునకు వివాహము చేయుము. నీ వీలోపలనే వివాహ సన్నాహమును జేసికొన సంసిద్ధుడవయి యుండుము. ఈ మూడు దినములను మీరాజరత్నము మే ముపదేశించిన మహామంత్రమును దినమునకు వేయేసిమాఱులు పునశ్చరణము చేయుచుండవలెను. అది సంవత్సరమునకుగాని సిద్ధి పొందదు. మీయింటికి వచ్చెడు చిన్నదానిని స్త్రీరూపమున వచ్చిన రాజరత్నము పాలిటి భాగ్యదేవతనుగా భావింపవలెనుగాని సామాన్యమానవభామినిగా భావింపగూడదు. మేము రేపు రాత్రి యంతర్హితులమయి పోయి మా యోగమహిమచేత నెడబాయకుండ మీరాజరత్నము పుత్రసంపదలతో వర్ధిల్లునట్లు కటాక్షించుచుండెదము. మే ముపదేశించినమంత్రము నిర్విఘ్నముగా ఫలించును గాక !

జంబు —— ఇవి యాశీర్వచనములు గాక మాకు నిజమయిన వరములే.

చిదా——మామంత్రముయొక్క ప్రయోగోపసంహారక్రమమును మే మింకొక్కసారి రాజరత్నమునకు నే డుపదేశింపవలెను. నీ వించుక యెడవు దూరముగా నుండవలెను. రేపటితో మాయుపదేశములు

కాగానే మేము తపస్సమాధినిమిత్తము హిమాద్రికి బోయెదము.

జంబు—చిత్తము. (అందఱును నిష్క్రమించు చున్నారు.)

తృతీయరంగము—నీళ్ళ రేవు.

[రంగమ్మ, వెంకమ్మ, సుందరమ్మ మొదలయినవారు ప్రవేశించుచున్నారు.]

రంగ—వెంకమ్మా! వెంకమ్మా! వూళ్ళోవింతలు విన్నావా? అందరూ చెడచెప్పుకుంటూవున్నారే.

వెంక—ఏమి వింతలే? కాలమహిమ యేమోకాని యిప్పుడు మహావిడ్డూరాలు పుడుతూ వున్నవి సుమా.

రంగ—నే నన్నది జంబుకేశ్వరవర్మగారి యింట్లో మాటే.

వెంక—నేనన్నదీ అదేనే. ఆడదానికి మీసాలు రావడం యేమిటే? యెక్కడైనా యింతవిరుద్ధం వుంటుందా? అంతా అబద్ధమే. ఇది వట్టికల్పన.

రంగ—మన కేం తెలుసునే అంతా నిజమనే చెప్పుకుంటూ వున్నారు.

సుంద—నిజం కాకపోతే వూరికే అబద్ధాలు పుట్టవు. మీరు విన్నది సందేహం లేకుండా నిజమైనమాట. దగ్గరగా రండి నేను రహస్యం చెపుతాను. (అవి రహస్యముగా) నేను వాళ్ళ యింటి దాసీదాన్ని కనుక్కున్నానరా. అది జంబుకేశ్వరవర్మగారి కోడలికి మీసాలు రావడం తాను కళ్ళారా చూచినా నసీ, రాణీవాసం అవడం చేత మొగవాళ్ళకి యెవరికీ తెలియదనీ, నిన్న నాతో ప్రమాణం చేసి చెప్పింది.

వెంక—ఇటువంటి విరుద్ధాలు యెక్కడనయినా వుంటవిటమ్మా? నేను నమ్మను.

చేసికొన్నారు. ఆలోపలినుండి వచ్చువా రెవరు ?

[నారాయణవర్మయు, రాజరత్నమును ప్రవేశించుచున్నారు.]

నారా—నేను నీయల్లుడను నారాయణవర్మను. ఈమె నాభార్య రాజరత్నము. మీయింటనుండి నీకూతురికి మంత్రోపదేశము చేసి వివాహము చేయించిన యోగిని నేనే. తరువాత నాలవనాటిరాత్రి రాచకన్నియవేషము వేసికొనివచ్చి నీకూతురిని వివాహము చేసికొన్నదియు నేనే. నా కామరూపమంత్రమహిమ ఇప్పుడు బోధపడినదా ? తెలియకపోయినపక్షమున, నీకొడుకును కూతురినిగా మార్చినదానిని బట్టియైనను నాకామరూపమంత్రమహిమ నీ కిప్పుడు బోధపడకపోదు. దౌహిత్రు డని చెప్పి నీ వియ్యంకునిసొత్తు జ్ఞాతులకు చెందకుండ నపహరింపవలెనన్నదురుద్దేశముతో కూతురు కొడు కని బొంకి నీ వింతకాలము లోకమును మోసపుచ్చినావు. రాజరత్నమునకు కొడుకు పుట్టినతరువాతనైనను నిజము గ్రహింతురని చెప్పి నే నప్పుడు జ్ఞాతులను బంపివేసినాను. ఎవరి కేవి రావలెనో వారి కవే వచ్చినవిగాని మగవానికి కడుపును రాలేదు; ఆడదానికి మీసములును రాలేదు. మే మిద్దఱమును సహాధ్యాయులమయి యున్నప్పుడు నీకొమార్తెకు నామీద గలిగినవలపుచేత గుట్టు బయులబడి మే మిద్దఱమును దంపతులము కాజూడగా నీ వనేకవిధముల విఘ్నములు కలిగించి కార్యఘాతము చేయ జూచినావు. నీవప్పుడు ద్వేషించిన నారాయణవర్మనే నేను. నేను యోగినయి యుండినప్పుడు నిన్నును సర్వజనులనుగూడ గాడిదలనుగా జేయుగలశక్తి నాయొద్ద నున్న దని నీతో జెప్పి యున్నాను. నా మంత్రమహిమను దెలిసికోలేకపోవుటచేత నిన్నును నమ్మరాని విరుద్ధాంశములను నమ్మించుటచేత జనులను గాడిదలనుగా జేసినానా ? లేదా ? ఇక మీరిట్టికామరూపములను మంత్రములనునమ్మకుందురుగాక!

జంబు—(విస్మయముతో) నాకు కోడలు రాగానే, విఫల ప్రయత్నుడయి నారాయణవర్మ చింతచేత గ్రామమువిడిచి లేచిపోయినా డని యెల్లవారును చెప్పుకొనగా విని నమ్మి యేమఱి యున్నాను. వీడు నాయింటనే ప్రవేశించి నాకొంప తీసినాడా! ఎంతమోసము చేసినాడు!

నారా—ఇది మోసము కాదు. ముందయినను నీవు బుద్ధికలిగి యుండుటకు చేసినహితోపదేశము.

జంబు—రాజరత్నమా! ఇంతకాలము కొడుకువలె పెంచి నీవు చదువు చెప్పించినందునకు తుదకు నీవు తండ్రికే పంగనామాలు పెట్టినావు! ఉపాధ్యాయులవద్ద నీవు మంచిచదువే చదివినావు. ఆడ దానికి చదువు చెప్పించరా దని పెద్దలు చెప్పినమాట—

రాజ—చదువులో నేమున్నది? చదువుకొబట్టియే నేను సద సద్వివేకముగలదాని నయి యీశ్వరభక్తి గలిగి—

జంబు—(మఱింత విభ్రాంతుఁ డయి) చాలు చాలు. ఈపాటి నీచదువు చాలించు. నీ వన్నపితృభక్తి యిదేనా?

రాజ—నీయెడల నాకు భక్తి లేకపోలేదు. నీ కేయుపచారము చేయుమన్నను నీయాజ్ఞను శిరసా వహించి యిప్పుడును చేసెదను. అయినను నే నన్యాయప్రవర్తనమునకు జొచ్చి యితరులను మోసము చేసి పితాజ్ఞయని తండ్రులకెల్లను దండ్రియు న్యాయాధిపతులకెల్ల న్యాయాధిపతియునగు నీశ్వరునియెడల నపరాధము చేయజాలను. ఈ నారాయణవర్మసొత్తును, ఇచ్చినయెడల నీ సొత్తును, మా సుఖజీవన మునకు జాలును. ఏసొత్తు రాకపోయినను మేము మాకష్టార్జితవిత్త ముతో సుఖపడుదుము. నామాతామహవిత్తము జ్ఞాతులకే పోనిమ్ము ఇంకొకమాటవినుమా—

జంబు—నా కన్నకూతురినోటినుండి. ఇటువంటిమాటలు,

నేను విసజాలను. ఓశాస్త్రీ! నీవు మాంధాతకథలను శిఖండికథలను జెప్పి, మంత్రిప్రిభావముచేత నా కొడుకును కోడలును తారుమారయి రని యెల్లవారికిని జెప్పుము. చేత జిక్కినసొత్తును నేను విడువను. ఆవల నన్నెవ్వరేమి చేసెదరో చూతము. నీతో నింకొక రహస్యము చెప్పెదను నావెంట రా.

(అని యావలి కీడ్చుకొని పోవుచున్నాఁడు)

లు లా య శా స్త్రి.

---

౧. రంగము—భోజనగృహము.

[కరణము వేంకటరావుపంతులు గారును, శంకరశాస్త్రిగారును, భోజనములు చేయుచు పరివేశించుచున్నారు.]

శంక—(జుఱ్ఱుచు) పంతులుగారూ! పెరుగు దివ్యంగావున్నది. ఇది ఆవు పెరుగేనా?

వెంక — ఆవుపెరు గింతగట్టిగా వుండదు. ఇది బఱ్ఱెపెరుగు. శాస్త్రం చదువుకున్నవారు యింతమాత్రిం తెలుసుకోలేకపోయినారు గదా?

శంక—(తనలో) ఇతడు నన్ను అల్లాటప్పా శాస్త్రికింద కట్టివేసినాడు. విస్తరిదగ్గిరనుంచి లేచేలోగా నాపాండిత్యము ఈయనకు కనపరచవలెను. (పయివంక చూచి) అటకమీాద గుమ్మిడికాయలు చాలావున్నవి. ఈయన కర్థం తెలియకుండా కగాప్మాండా లెక్కడివని అడుగుదామా? వద్దువద్దు. ఈయన కీమాట కర్థం తెలియకపోయినా నేను అటకవంక చూడడాన్ని పట్టి గ్రిహిస్తాడు. ఏ దయినా గూఢమైనప్రిశ్న వెయ్యవలెను. (ఆలోచించి) ఇన్ని గుమ్మిడికాయలు

వుండడాన్నిబట్టి యీయనకు పొలమూ వ్యవసాయమూ చాలావుండీ వుంటుంది. ఎన్నికాళ్ళపశువు లున్న వని అడుగుదామా? ఇలాగడిగితే తెలిసిపోతుంది. ఎన్ని వృషభా లున్న వని అడుగుచాను. వద్దు. ఆమాటా తెలిసేదే. ఎన్నిపోతు లున్నవని సంస్కృతపదాలతో అడుగుచాను. దున్నపోతులకు సంస్కృతం యేమిషీ? మహిషము. మహిషమంటే తెలిసిపోచుంది ఇంతకంటె పెద్దమాట వెయ్యవలెను. ఏదీ నిఘంటు? దిక్కుమాలిననిఘంటు సమయానికి స్మరణకు రాదు. ఈశ్వరానుగ్రహంవల్ల జ్ఞాపకం వచ్చింది. నేను నాపాలిట దైవమున్నాడు. "లులాయో మహిషో వాహద్విష త్కాసర సైరిభాః" ఇత్యమరః లులాయమన్న పదం దివ్యమైనది. (ప్రకాశంగా) కరణంగారూ! మీవద్ద లులాయాలు చాలావున్నట్టున్న వే?

వెంక— (తనలో) యీయన యేదో మహాకవిప్రయోగం చేసినాడు. లులాయమన్నది వ్యాసఘట్టంలాగు వున్నదే? ఎంత ఆలోచించినా అర్థము కావడము లేదు. అర్థం అడిగితే మనపాండిత్యానికి భంగం వస్తుంది. బుద్ధిబలముచేత యెలాగయినా అడగకుండా అర్థం నాఅంతట నేనే కనిపెట్టవలెను. (ఆలోచించి) ఓహోహో! ఆ పదమున కర్థ మిప్పుడు బోధపడినది. నియోగిబిడ్డ నీమాత్రము గ్రహించ లేకపోతే యిక నాబుద్ధివిశేష మేమున్నది? ఈగున అటకవంక చాలాసేపు చూచి నన్నీప్రశ్న అడిగినాడు. లులాయాలనగా గుమ్మడికాయలు. ఈవిషయము నేనాలోచించినట్టు కనపడకూడదు. (ప్రకాశముగా) శాస్త్రుల్లుగారూ! ఏమిటీ అడిగినారు? నా కుమారుడిపెళ్ళివిషయము ఆలోచిస్తూ తిన్నగా విన లేదు.

శంక—మీవద్ద లులాయాలు చాలావున్నట్టున్న వే అన్నాను.

వెంక—లులాయాలా? ఎన్నో లేవండీ • ఈవున్నవి మాకు

సంవత్సరంపొడుగునా కూరకే చాలవు. మావాడిపెళ్ళికూడా వస్తూ వున్నది.

శంక——(తనలో) ఇంతకతిశయమైనపదం ప్రియోగించినా, ఈయన యర్థం యిట్టే గ్రహించినాడే నియోగులు తెలుగుకవిత్వం చెప్పే వారుగనుక వీరికి నిఘంటులు ముఖస్తంగా వచ్చి వుంటవి. అయ్యో! నేడు నాకు గొడ్డుమాంసం తినేవాళ్ళ యింట్లో భోజనం తటస్థమయినదే. దీని కేమి ప్రాయశ్చిత్తం వున్నదో? ఈసంగతి యెవరితోనూ చెప్పను. వీరియింట్లో భోజనం చెయ్యలేదని వక్క అబద్ధం ఆడితే అన్నీ తీరిపో తవి. విస్తరి విడిచిపెట్టి లేచిపోతాను.

(అని లేచుచున్నాఁడు.)

వెంక——ఆకాస్తఅన్నం తిని మరీ లేచి పో వయ్యా. కరువు కాలంలో అన్నం పారవెయ్యరాదు.

శంక——నాకు కడుపునొప్పి వచ్చిందండి వేగిరం పోవలెను.

(అని లేచి పరుగెత్తుచున్నాఁడు.)

---

౪. రంగము——మేజస్ట్రీటుకోర్టు.

[మేజస్ట్రీటుదగ్గర ఫిర్యాదీ వెంకటరావుపంతులును సాక్షులును ముద్దాయీ శంకరశాస్త్రియును నిలుచున్నారు.]

మేజ——ఏమయ్యా ? శాస్త్రీ ! ఇతడు నీమీాద తెచ్చినఅప్రతిష్ఠ నేరం పూర్తిగా రుజువుపడ్డది. నీ వితడు గొడ్డుమాంసం తినేవా డని ప్రచురం చేసినావా ? లేదా ?

శంక——నేను యెవ్వరితోనూ చెప్పలేదండి. ఇతడు తాను కున్నపోతులను కూరకోసం తెప్పించుకొన్నా నని నాతో చెప్పితే మొక్క-పోయి ఆమాట నేను రహస్యంగా నాభార్యతో అన్నాను.

అంతకంటె నేను మరి యేపాపమూ యెరగను. ఆసంగతి యెలాగో వూరంతా వ్యాపించింది. పాపం యెప్పుడూ దాగదండి.

వెంక—నేనా ? నేనా ? నేను దున్నపోతులను కూరకోసం తెప్పించినా నని నీతో చెప్పినానుటయ్యా ?

శంక—ఆహా. నీవే నీవే. అక్షరాలా నీవే చెప్పినావు. నేను మీావద్ద లులాయాలు చాలా వున్నట్టున్నవే అంటే, అవి కూరకే చాల వని నీ వప్పు డనలేదూ ? అనలే దని బిడ్డలుకలవాడవు రామాయణం నెత్తిమీాద పెట్టుకుని యేదీ ప్రమాణం చెయ్యి.

వెంక—ఆహా ! హాహా ! నీపాండిత్యం యేడిసినట్లే వున్నది. లులాయా లంటే గుమ్మడికాయలు కావటయ్యా ?

శంక — నీపాండిత్యం మొత్తుకున్నట్లేవున్నది. లులాయాలంటే దున్నపోతులు. ఎవరిని పిలిచి అడుగుతారో అడిగి నాఅర్థం కాదనిపించండి.

మేజ—ఏమయ్యా? మీారిద్దరూ పబ్లీకులో అలా వివాదపడుతూవున్నారు ? కంటెంప్టాఫుకోర్టుకింద శిక్షిస్తాము సుమండీ. ఓశాస్త్రీ! కోర్టువా రడిగినదానికి జవాబు చెప్పు. ఆమాట యేమిటీ? లులా—?

శంక—లులాయ మండి. నేను లులాయమంటే యీామహాను భావుడు గుమ్మడికాయ అని అర్థం చేసుకున్నాడట.

మేజ—ఈమాట యెప్పుడూ విన్నట్టు లేదే! ఇది తెలుగు మాటేనా ? ఇది యింగ్లీషుమాటలాగున్నది డిక్షనేరీ చూడవలెను. స్పెల్లింగు యెట్లాగయ్యా ?

శంక—ఇది సంస్కృతపుమాటండి. స్పెల్లింగు మూర్ధణాలండి. మొన్న మా పిల్లవాడికి కావలిస్తే బజారులో మూర్ధణాలకే కొని యిచ్చినానండి.

మేజ—సంస్కృతంమాటా? అలాగుచెప్పు. అందుచేతనే యీమాట నాకు యింగ్లీషుడిక్షనేరీలో యెక్కడా చూచినట్టు జ్ఞాపకం రాలేదు. అంత పెద్దమాట యెందుకు వుపయోగించినావయ్యా? మనం మాట్లాడుకోవడం వకరిమాటల అర్థం నకరికి తెలియడానికా? మరి యెందుకైనానా?

శంక.—మాది పండితసాంప్రదాయం గనుక పాండిత్యం కనపడడానికి కాస్త మారుమూలమాట ప్రయోగించినానండి. పామరులు వుపయోగించే సామాన్యపుమాటలే వుపయోగిస్తే. మాపాండిత్యమూ మా ఆధిక్యమూ యేమిటండి?

మేజ—ఏదీ ఆమాట? లులాయమూ? నాకు చూస్తే నీవే బుద్ధిలేని లులాయంలాగు కనపడుతూ వున్నావే. నీపే రెవరూ? శంకరశాస్త్రి? శంకరశాస్త్రి అనడంకంటె నేటినుంచి నిన్ను లులాయశాస్త్రి అంటేనే బాగావుండేటట్టు కనపడుతూవున్నది.

ఒకప్లీడరు—లులాయశాస్త్రి అంటే అర్థం యేమిటీ?

ఇంకొక ప్లీడరు—దున్నపోతుశాస్త్రి అని అర్థము.

వేరొకప్లీడరు—ఆహాహాహాహా! దున్నపోతుశాస్త్రి? కేజు చూడవచ్చిన యీకుర్రవాళ్ళు నవ్వాపట్టలేక వీధిలోకి యెలా పరుగెత్తుతూవున్నారో.

శంక—అయ్యా! అయ్యా! మేజస్ట్రీటుగారూ! తమరు చిత్తగించవలెను. వీధిలో కుర్రిముండాకొడుకులు "దున్నపోతుశాస్త్రీ" "దున్నపోతుశాస్త్రీ" అని యెలా అరుస్తూవున్నారో చూడండి. తమరు శాస్త మందలిస్తేనేకాని వాళ్ళనోళ్ళు మూత పడవు. తమ రిప్పుడు శిక్షించకపోతే రేపటినుంచి నన్ను బొత్తిగానే అల్లరిపిల్లకాయలు వీధిలో గేలిచేసి. వదిలిపెడుతారు

మేజ—బంట్రోత్ ! ఆ అరచేవాళ్ళను పట్టుకొని యిలాకోర్టు వారియెదుటకు యీడ్చుకొని రా.

బంట్రోతు—చిత్తము మహాప్రభూ !

మేజ — నీవు చూపిన పాండిత్యానికి తగిన బిరుదుపేరు నీకు శాశ్వతంగా లభించింది. యింతమందినోళ్ళల్లో పడ్డతరువాత యిక నీకది తీసివేసుకుందామన్నా పోయేది కాదు. అవునుగానీ నీవు రహస్యంగా నీభార్యతో చెప్పినమాట వూరిమీద యెలాపడ్డనయ్యా !

శంక—దానమ్మకడుపుకాల! ఆడవాళ్ళతో చెప్పినమాట దాగదండి. దానికి పూర్వం ధర్మరాజువారిశాపం వున్నదండి. అది దాని చెలికత్తె వక్కత్తెతో చెపితే ఆనోటినూట ఆనోట వూరంతా పాకి వీధి వీధినీ పాకిందండి.

మేజ—ఇదంతా భ్రమచేత వచ్చిందిగాని మరివకటి కాదు. ఇందులో దురుద్దేశం కనపడనందున కేజు కొట్టివేసినాము. ఓశాస్త్రీ! ఇకముందునీవు యెప్పుడూ యిటువంటి పెద్దమాటలు వుపయోగించబోకు. ఇప్పుడయినదానితో బుద్ధి తెచ్చుకో. నిన్ను విడుదల చేసినాము పో.

శంక—చిత్తము. చిత్తము.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

పూర్వాచారము.

[పూర్వాచారదీక్షితులును, నవనాగరికశాస్త్రియు, మొదలైన సభికు లందఱు నిండియుండఁగా నుపన్యాసకు లయిన యవివేకాచార్యులవా రుపన్యాసము నారంభించున్నారు.]

అవి-- ఓ విద్వన్మహాజనులారా! నేడు లోకోపకారమైన మహా విషయమును గూర్చి యుపన్యసింపబోవు చున్నాను. మీ రందఱును శాస్త్రసమ్మతమైన నా యుపన్యాసమును సావధానముగా విని, పాఠశాలలో శూద్రులను జదువకుండ జేయుడని దొరతనమువారికి సంఘ విజ్ఞాపనము పంపవలెను. శూద్రులు చదువుకొనుటచేత బొత్తిగా తెలుగుమాలిపోయి బ్రాహ్మణభక్తి లేక స్వధర్మమును విడిచి యధోగతి పాలయి చెడిపోవుచున్నారు. బ్రాహ్మణసేవయేకదా శూద్రులకు కులధర్మము? అది యొక్కటి లేకపోయినపక్షమున, ఎన్నిగుణసంపదలు కలిగినను అవి యన్నియు వ్యర్థములు. స్వధర్మ మయిన బ్రాహ్మణసేవను పరిత్యజించుటవలన, శూద్రుల కిహలోకహానియు పరలోకహానియుసంభవించును. ఇదియంతయు నేను శూద్రులునిష్కారణముగా స్వధర్మమును గౌరవింపక చెడిపోవుచున్నారే యన్నజాలిచేత వారి క్షేమముకొఱకు చెప్పుచున్నానే కాని స్వప్రయోజనపరత్వముచేత గాదు. స్వధర్మత్యాగము మహాపాతకము. స్వధర్మమును విడిచి సంపదలతో తులతూగుటకంటె స్వధర్మమునం దుండి తిండికి లేక మరణము నొందుట శ్రేయస్కరము.

శ్లో. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః.

అని శ్రీకృష్ణులవారు భగవద్గీతలలో తృతీయాధ్యాయమున సెలవిచ్చి

యున్నారు. "చక్కగా ననుష్ఠింపబడిన పరధర్మమునకంటె విగుణమైన స్వధర్మము శ్రేష్ఠము. స్వధర్మమునందు చచ్చుటమేలు; పరధర్మము భయావహమైనది" అని శ్రీకృష్ణులవారే సెలవిచ్చునప్పుడు నాబోటులు వేఱుగ జెప్పవలసిన దేమున్నది? శూద్రులు చదువుకొనుట యెంతో పాపము.

శ్లో. శూద్రం మక్షరసంయుక్తమ్ దూరతః పరివర్జయేత్.

అని శాస్త్రములు ఘోషపెట్టుచున్నవి. చదువుకొన్న శూద్రుని దూరముగా తఱిమివేయవలెను. శూద్రులు చదువుకొనుట పూర్వాచారవిరుద్ధము. మహానుభావులైనపూర్వులు చేసినశాస్త్రములను మీఱవచ్చునా? పూర్వులమహిమలముందఱ మన మెంతటివారము? పూర్వులవంటి బుద్ధిమంతు లిప్పు డెక్కడ నున్నారు? యుగములనాటి వారిబుద్ధితోను సర్వజ్ఞత్వముతోను నిన్న మొన్నటి మన యల్పజ్ఞానము సాటి యగునా? శూద్రులకు విద్య మంచిదయినపక్షమున మన పూర్వులు దాని నేల నిషేధింతురు? కృతయుగమునాటి మహాపురుషుల కంటె నీ పాడుకలియుగములోనివా రెక్కువ బుద్ధిమంతులా? కించిజ్ఞులమయినమనము సదా వారియాజ్ఞలకు బద్ధులమయి నడవవలెను. శాస్త్రధిక్కారముచేయరాదు. ఇది యనాదిగా వచ్చుచున్న శిష్టాచారముగాని నిన్న మొన్న వచ్చినదికాదు. నవనాగరికుల కుయుక్తుల నమ్మి మీ రెవ్వరును శూద్రులవిద్య కంగీకరింపగూడదు. ఈ నవనాగరికులమాటలు నమ్మి యొక్కదానిలో నేడు మనము కొంచె మవకాశ మిచ్చినపక్షమున రేపు వా రింతకంటెను హీనమైనదురాచారమును దెచ్చి పెట్టుదురు. అప్పుడు శాస్త్రప్రమాణము నిర్మూలమయి పోవును. శాస్త్రవిశ్వాసము చెడినపక్షమున దేశమున కెన్నియనర్థములైన సంప్రాప్తము లగును. శూద్రులకు విద్య లేకపోవుటవలన

నెవ్వరికిని నష్టములేదు. స్వధర్మపరాయణు లయినశూద్రులలో సహిత మతృప్తిలేదు. అపూర్వబుద్ధిమంతు లైనయీనవనాగరికు లొక్కరు దక్క నెవ్వరును మా కీమార్పు కావలె నని కోరుచుండ లేదు. క్రొత్త క్రొత్తమార్పులవలన దేశసంక్షోభము కలుగును. జనులలో నిప్పుడున్న నైకమత్యము చెడిపోవును. కాబట్టి ప్రభుత్వమువారికి శూద్రులవిద్య మాన్పించి కులాచారధర్మములను రక్షింపవలయు నని శీఘ్రముగా సంఘవిజ్ఞాపనములు ప్రతిగ్రామమునుండి పంపవలెను.

పూర్వా—ఆహా! ఏమి యీవుపన్యాసము! దీనిని సహస్ర ముఖములు గలశేషు డయినను వర్ణింపజాలడు.

నవ—ఉపన్యాసము సాంత మయినదా ?

పూర్వా—ఏమి ? ఇం దేమైనలోప మున్నదా ?

నవ—మాటలలో లోపము లేదు.

పూర్వా—మీ రేమైన చెప్పదలచుకొన్నారా ?

నవ—మీ సెల వయినపక్షమున నాలుగుమాటలు చెప్పెదను. పూర్వులే బుద్ధిమంతులనియు, ఇప్పటివారు బుద్ధిహీను లనియు, పూర్వాచారమును దేనిని మీ రంగీకరింపరా దనియు, చెప్పెడుమాట వెఱ్ఱి మాట. పూర్వ మున్నయీశ్వరుడే యిప్పు డున్నాడు; పూర్వులకిచ్చిన బుద్ధినే యిప్పటివారికిని బ్రసాదించి యున్నాడు. ఆబుద్ధి నుపయోగ పఱుచుకోకపోయినదోషము మనయందే యున్నది.

అవి—ఆహాహాహా! ఏమి యీయుక్తి! పూర్వులబుద్ధి యెక్కడ? మనబుద్ధి యెక్కడ ? యుగములక్రిందట నున్న వారి కున్నలోకానుభవము నిన్న మొన్న పుట్టిన మన కెక్కడనుండి వచ్చును ? వారు సర్వజ్ఞులు, సువివేకులు; మహామాధ్యులు.

నవ—ఈవర్ణనలు చాలును. సర్వజ్ఞులయిన పెద్దలు, పూర్వుల

వివేకము, పూర్వకాలపు మహిమలు, ఇటువంటిమాటలు వినుట కెంతయు నింపుగానే యుండును. కాని యిందు సార మేదియు లేదు. ఇటువంటి పనికిమాలిననమ్మక మాలోచన లేకపోవుటచేతనే సంభవించును. మీరు సెలవిచ్చినట్లు లోకానుభవమువలన బుద్ధి హెచ్చుననుటకు సందేహము లేదు. పిన్నలకంటె పెద్దలకు బుద్ధి హెచ్చగుట నైసర్గికము. అనుభవ మెక్కువ యున్నవారికి బుద్ధి హెచ్చకపోవుట యస్వాభావికము. అది వారి బుద్ధిజాడ్యము "ఎవరు పెద్దలు? ఎవరు పిన్నలు? ఎవరికి లోకానుభవ మెక్కువగలదు?" అన్నయంశములను విచారింపవలెను. లోకానుభవ మెక్కువగుటనుబట్టి బ్రతికియున్న వారిలో చిన్నవారికంటె పెద్దవా రధికజ్ఞాను లయినట్లే, గతించిన వారిలో మొదటితరమువారికంటె దరువాతితరమువారును వారికంటె నాపయితరమువారును గ్రమక్రమముగా నధికానుభవము కలవారయి యధికజ్ఞానము కలవా రగుచుండుట స్వాభావికము. అట్లు కాకుండుట స్వభావికవిరుద్ధమైన బుద్ధిరోగము. నిజము విచారింపగా నల్పకాలానుభవము గలవారగుటచేత బూర్వమం దుండినవారే తరువాతనుండిన వారికంటె బిన్న లని చెప్పవచ్చును. పరంపరగా వచ్చుచున్న పెక్కు తరములవారి యనుభవముకూడ మన యనుభవముతో జేరుచుండుట చేత మనమే విశేషజ్ఞానము కల వృద్ధులము కావలెను. కాబట్టి మన మాపూర్వులు చెప్పినదెల్లను మంచిదను మూర్ఖపుపట్టును మాని మన బుద్ధిచేత నాలోచించి యిప్పటిస్థితినిబట్టి కాలానుగుణములయిన మార్పులను జేసికొనుచు లోకమునకు సుఖాభివృద్ధి కలుగజేయుచుండవలెను. పూర్వులకంటె మన మొకవేళ నల్పబుద్ధి కలవారమేయయినను వారి జ్ఞానమునకు మాజ్ఞానమును జేర్చి పయిని గూర్చుండుటచేత దీర్ఘకాయుని భుజములమీద గూర్చున్న మరుగుజ్జువాడైనవలెనే యెక్కువ

దూరము‌ను జూడవచ్చునని యొకానొకవిద్వాంసుడు వ్రాసియున్నాడు. జ్ఞాననేత్రము మూతపడి యంధప్రాయముగా నున్నజనసామాన్యము విద్యాగంధము నొంది కన్ను దెఱచినంగాని మనదేశము మంచిస్థితికి రానేరదు. అజ్ఞానరోగముచేతనే మనదేశమునందు జను లంతకంతకు హీనదశకు వచ్చుట సంభవించుచున్నది. అజ్ఞానరోగపీడితు లయినవారికి బుద్ధ్యనుపానముతో దివ్యౌషధమును సేవింపనిచ్చినంగాని జ్ఞానారోగ్యము గలిగి దేశము బాగుపడదు.

అవి— ఈపాటి యీవెఱ్ఱిచదువు చాలించు. శాస్త్రముల నెన్నడైనమార్ప శక్యమగునా? నీవు చెప్పినది శాస్త్రవిరుద్ధ మగుటచేత కేవలోన్మత్తప్రలాపము; నీమాటలు ప్రమాణబుద్ధి గల మావంటిశిష్టు లంగీకరింపదగినవి కావు.

నవ— పెద్దలు చేసినశాస్త్రరక్షణము నిమిత్తము పెద్దల కెల్లను పెద్దయైనయీశ్వరుడు దయచేసినబుద్ధిని పనిగొనజాలకుడు. మనుష్యుల సౌఖ్యాభివృద్ధినిమిత్తము శాస్త్రములు చేయబడినవి గాని శాస్త్రములగౌరవమును కాపాడునిమిత్తము కష్టపడుట కయి మనుష్యులు చేయబడలేదు. పూర్వకాలమునకు దగినట్టుగా జేయబడిన శాస్త్రమును మార్పగూడదని యవిచారమూలకముగా భావించి యందలి యంశములు పనికిమాలిన వయి నష్టకరము లయిన వని తెలిసి నప్పుడుకూడ దుర్భ్రమచే పట్టుపట్టి మార్చుకోక సహించుచువచ్చిన యెడల శాస్త్రగౌరవము విడిచి జనులు దానిని బహిరంగముగానే మీఱుదురు. మీవంటిపెద్ద లిందఱుపన్యాసముచేసి శాస్త్రప్రమాణము లను జూపుచున్నను, శూద్రులలో విద్య వృద్ధియగుచుండుటయే యిందునకు నిదర్శనముగా జూపవచ్చును. కొందఱిట్లు ప్రస్తుత కాలమునకు దగని శాస్త్రవిశ్వాసమును మాని వృద్ధిపొందుచుండగా,

బుద్ధిని విడిచి ప్రతివిషయమునను శాస్త్రము శాస్త్రమని పలవరించు వారు పాపములనుసహితము శాస్త్రోక్తముగానే చేయుచు దమకును దేశమునకుగూడ ననర్థములను దెచ్చిపెట్టు చున్నారు.

అవి—కలికాలమహిమచేత మీవంటివారి కిప్పు డిటువంటి బుద్ధులు పుట్టుచున్నవి. శూద్రు లింతకాలమును జదువు లేక చచ్చి పోయినారా? వీరి పూర్వులు సుఖపడ లేదా? ధనము సంపాదించ లేదా? బ్రాహ్మణపూజ చేసి తరింప లేదా? దేశము మహోన్నతదశయం దుండినదికాదా? ఇంతకాలము లేనిచదువు శూద్రుల కిప్పు డేల కావలసివచ్చినవి?

నవ—ఇటువంటి ప్రశ్న లడుగువారికి సమాధానము చెప్పి యొప్పించుట బ్రహ్మకు శక్యము కాదు! ఈప్రశ్నములు పూర్వ మొక గృహస్థునకును మీవంటి మఱియొక బుద్ధిమంతునకును నడిచిన ప్రసంగమును స్మరణకు దెచ్చి నవ్వు తెప్పించు చున్నది.

అవి—ఆ యవివేకప్రసంగ మేది?

నవ—ఒకగ్రామములోనివారు తరములనుండి యొకచెరువు లోని కలుషోదకము ద్రాగుచు గారణము తెలియలేక యుబ్బురోగము చేత బాధపడుచుండిరి. ఆగ్రామమునం దున్న వారిలో గొందఱు పాటు పడి ధనము సంపాదించి ధనికులయినవారును గలరు. ఇట్లుండగా నాధనికులలో నొకడు పూర్వాచారవిరుద్ధముగా దనకుమారుని రాజ ధానికిబంపి యింగ్లీషుపాఠశాలలో జదువుచెప్పించెను. ఆబాలుడక్కడ బరీక్షలం దేఱి యారోగ్యధర్మములను నేర్చికొనివచ్చి స్వగ్రామములో సభచేసి "మనగ్రామములోని యుబ్బుజబ్బులన్నియు నీటికాలుష్యము వలన గలుగుచున్నవి. మనము పానముచేయునీటిలో కల్లులు నాన వేయుట, గొడ్లను కడుగుట మొదలయిన కల్మషములను జేసినీక నీరు

పరిశుద్ధపఱుపవలెను. అని యుపన్యసించెను.

అవి—అప్పు డేమిజరిగినది ?

నవ—అక్కడ నున్నవారిలో నొక ప్రబుద్ధుడు లేచి "చెఱువు నీరు చిరకాలమునుండి యీవిధముగానే యున్నది. మీతండ్రితాత లీ నీరు త్రాగుచు నుబ్బుజబ్బుతో చిరకాలము జీవించి ధనము సంపాదించలేదా ? ఇప్పుడేమి క్రొత్త వచ్చినది ? మనము పూర్వాచారము మీఱరాదు. ఈజబ్బువల్ల దోషము లేదు. ఇది గ్రామములో తరములనాటినుండి వచ్చుచున్నది. " అని సమాధానము చెప్పెను.

అవి—మంచిసమాధానము చెప్పినాడు. అంతటితో నాకుఱ్ఱవాని నో రడగినదా ?

నవ—ఆకుఱ్ఱవా డిట్లనియెను—"ఓ బుద్ధిహీనుడా ! నా పెద్దలు కాని యితరులుకాని ధనికులయినది యీ రోగముచేతగాదు. యీ రోగమే లేకపోయిన పక్షమున వా రింతకంటెను అధిక ధనవంతులై యెక్కువ బల సౌఖ్యముల ననుభవించి యుందురు. "

అవి—అనగానే దొడమీఁద రెండువాయించలేదా ? వానికి జరగకపోయినను నీవు మరల మాటాడినపక్షమున నీ కిప్పుడు దొడశుద్ధి జరుగును.

నవ—మీకు నమస్కారము. నేను బోయెదను.

(అంతట సభ కలిసెను.)

లక్కాగేడె.

శ్లో. ముగ్ధే పయోపి దుగ్ధే తృణ మప్యశనాతి తర్ణకం సూతే
నాడింధమస్య మాయాం జాతు న జానాసి జాతుషీ సుహిషీ.

ప్రథమరంగము—కామావధానులగృహము.

[కామావధానులు, సోమిదేవియుఁ బ్రవేశించుచున్నారు.]

సోమి — సోమయాజులవారియింట పుట్టినాను; వాజిపేయయాజులవారియింట చొచ్చినాను; మిమ్మలిని చేసుకొని నేను వక్క నగయినా పెట్టుకోలేదు. వక్క మంచి జరీబట్టయినా కట్టుకోలేదు.

కామ—నన్నేమంచావే? నేను తెచ్చినదంతా నీచేతులోనే పోస్తూవున్నాను. నిన్ను మంచి చీరలూ నగలూ కొనుక్కోకుండా నేను వద్దన్నానా?

సోమి.—ముష్టిసంపాదనలెండి. మీరు తెచ్చేదంతా తిన్నగా తింటే తిండికే సరిపోదు. మాడలు తెస్తారా? వరహాలు తెస్తారా? యెప్పుడు తెచ్చి చేతిలోపెట్టినా నాలుగు సంభావన డబ్బులేనా? యేమయినా అంతకంటె యెక్కువ మహాభాగ్యం వొలికిస్తూ వున్నారా? ఆబిచ్చపుడబ్బులతోనేనా మీరు నన్ను నగలూ చీరలూ కొనుక్కోమనేది?

కామా—ముష్టిసంపాదనగాక మనకు మాన్యాలూ మడులూ వున్నవా యేమిషి? యేమి తెచ్చినా వంటెరిగాణ్ని నారెక్కల కష్టం మీద తేవలెను. మనకు వుండే పిత్రార్జితం మాన్యపుకొండ్రికాస్తా నీపెళ్ళితో కడతేరింది—

సోమి—అదిగో? ఆవూసు తలపెట్టవద్దని యెన్నిసార్లుచెప్పినా గడియ గడియకూ నాపెళ్ళిమాట తలపెడుతూనే వుంచారు. ఇఁకో

సారి మళ్ళీ ఆవూ పెత్తినారంటే మీకూనాకూ బాగా జరగదుసుమండీ. పోయిన వైధవమాన్యంకోసం యేడవకపోతే తుండులాగు వున్నారు పనిచేసి నెలకు పదివరహాలసొమ్ము సంపాదించి తెచ్చి నాచేతిలో వెయ్యరాదా? నేనప్పుడు సంసారం గుప్తంగా జరిపి పదివరహాలగుల్లలు చేయించి వంట పెట్టుకుంటాను.

కామా—నాకు నెలకు పదివరహాలు యెవరు యిస్తారు? శుభాలకూ అశుభాలకూ యింటింటికీ తిరిగి మానాభిమానాలు వదలి అడ్డమైనవాళ్ళనూ పీడిస్తే నాలుగువరాలసొమ్ము దొరికేటప్పటికి బ్రహ్మాండమవుతూ వున్నది. అన్నానికీ వస్త్రానికీ లోపంలేదు గదా? నగలు లేకపోతే తిని సుఖంగా వుండరాదా?

సోమి—పరగడ పందిలాగు పొట్టకింత తిని గౌరవం లేకుండా బ్రతుకుమంటావు. అలాగంటి బ్రతుకు బ్రతకడంకంటె నూతిలోనో గోతిలోనో పడి గుక్కెడు ప్రాణం వొక్కమాటు పోగొట్టుకోవడం వుత్తమము. మీరు పరువూ ప్రతిష్ఠా ముద్దూ ముచ్చటా యేమీ యెరగరు. పెళ్ళాము చేసిపెడితే పొట్టకింత తిని వూరుపట్టుకుని తిరిగేవాడికి యింట్లో ఆడదానిపాట్లు యేమి తెలుస్తవి? నేను మొన్న మోదులాగు పేరంటానికి వెళ్ళినప్పుడు నీకు నగలు యేమీ లేవా? అని అడిగితే అమ్మలక్కలునలుగురిలోనూ యేమీ చెప్పలేక తల పొట్టలో పెట్టుకుని యింటికి చక్కా వచ్చినాను. ముష్టి గురవావధానులు పెళ్ళామును చూస్తే ముచ్చటవుతుంది. దానివంటినిండా యెన్నినగలు వున్నవో చూడండి.

కామా—దాని మొగుడు పునాసాతారా వెళ్ళి సంపాదించుకొని వచ్చినాడు గనుక దాని కన్నినగలు వచ్చినవి. వాణ్నికూడా నావలె వూళ్ళోవుండి సంపాదించమను! యెన్ని నగలు పెడుతాడో చూతాము.

సోమి—మీరు పూళ్ళోవుండి మహద్భాగ్యం. బావుకుంటూ వున్నారు. యెన్నియేళ్ళువచ్చినా మీకు బుద్ధిలేదు. ఆ గుర్వావధానులను చూచిఅయినా కాస్తబుద్ధి తెచ్చుకోరామా! మిమ్మలిని పునా సాతారా వెళ్ళి సంపాదించవద్దని యెవరు కాళ్ళూచేతులూకట్టి యింట్లో పడవేసినారు? మీకు కాళ్ళు విరిగిపోయినవా యేమిషి? మూలనున్న ముసలముండలాగు పూరు విడచి కదలరు. మిమ్మలిని యేమయినా అంటే రోషంగాని—

కామ—ఓసి! కోపపడకే నీపుణ్యమాయెను. రేపు నేను యీ పూళ్ళో మళ్ళీ నిద్రచేస్తే నేను బ్రాహ్మణ్ని కాను. తెల్లవారగట్ల లేచిపోయి పునాసాతారా వెళ్ళి సంపాదించుకొని వచ్చి నీకు కావలసినన్ని నగలు చేయించి పెడుచాను.

సోమి—మీతల్లికడుపు చల్లగా వెయ్యేళ్ళు వర్ధిల్లండి. ఇప్పుడు వచ్చినబుద్ధి యిదివరకే వచ్చినట్టయితే మన మీపాటే బాగుపడి నలుగురిలోనూ తలయెత్తుకొని తిరుగుచూ వుందుము. మనకీదుర్యోగం వుండగా యిలాగంటిమంచిబుద్ధి మీకుయిదివరకు యెందుకుపుడుచుంది? లోపలకు రండి. మీకు యివాళ పిండివంటతో భోజనం పెడుచాను.

(ఇద్దఱును పోవుచున్నారు.)

ద్వితీయరంగము—పునానగరము.

[కామావధానులును, వీరాసారియు ప్రవేశించుచున్నారు.]

కామా—వీరాసారీ! నగలు చేయించేటట్టయితే యీపునహో నగరంలో వున్న కంసాలులను యెవరిని నమ్మవద్దని నీవు చెప్పినమాట మరచిపోలేదు సుమా.

వీరా—సిత్తము. సిత్తము. కానయితే. మహా వర్ణమేకానంద్ధి

మూచెడ్డ దగాకోరువర్ణ మండి. కంసాలివాడిని గొవడినీ నమ్మకూడ దండి. కాసుబంగారం చేతులోపెడితే అరకాసుబంగారం అపహరించి మోసంచేస్తారు.

కామా—నీవు దొడ్డవాడవుగనుక స్వజాతి అభిమానం లేకుండా సత్యం చెపుచూ వున్నావు. నీసత్యసంధతకు నాకు బహుసంతోష మవుచున్నది.

వీరా—ఎంతమాట సెలవిచ్చినారు! తమస్తోత్రానికి నే నెంత వాణ్నండి? తమవంటిపెద్దల శిశ్రూషవల్ల కొంచెంపుణ్యమూ పాపమూ అనేతెలివి గలిగింది. డబ్బు పావనము కాదండి. యీమొండిఘటాలు యెప్పుడో పోతవి. బ్రతికినన్నాళ్ళూ నలుగురుచేత యింత మంచివా డనిపించుకొని యెవ్వరికీ ద్రోహం చెయ్యకుండా లేచిపోయిన వా డొక్కడే కృతార్థుడు. ఇది సత్యానికి కాలంకాదండి. ఎక్కడచూచినా అబద్ధాలూ మాయలూ మోసాలూ. తమరు మహానుభావులు గనుక నావంటి నిజంచెప్పేవాళ్ళనుచూస్తే దయ. మీవంటిపెద్దల ఆశీర్వచనం వల్ల ప్రాణంపోయినా అబద్ధం ఆడకుండా వుండేవృత్తి భగవంతుడు నాకు దయచేసినాడు.

కామా—నీవు మహాయోగ్యుడవు. మాటాడినకొద్దినీయోగ్యత తెలుస్తూవున్నది. నీయెరుకను యెవరైనా నమ్మకమైన మంచిపనివాడు లేడుగదా?

వీరా—పనివాళ్ళు కావలసినంతమందివున్నారు కానండి యింత పునాపట్టణంలో నమ్మకమైనవాడు వక్కడయినా దొరకడండి. బాబు! మీా రేమయినా నగలు చేయిస్తారా యేమిటండి? ఈపట్టణానికి వచ్చి యేమాత్రం సంపాదించినారు?

కామా—ఎంతోలేదోయి యిన్నూరువరహాలుసంపాదించినాను,

వీరా—ఇంతేనాండి? ఇది వట్టికలికాల మండి. ఎటువంటివారి దానము చెయ్యవలెనో యెవరికి యిస్తే పుణ్యమూ పురుషార్థమూ వుంటుందో యెరిగే ప్రాజ్ఞత లోకులకు లేదండి. మీచేతిలో వక్క తృణం పెడితే, అదంతా కోటిగుణితంగా స్వర్గంలో దాచుకోవడమని గ్రహించేవారు లేరు. బాబు! ఈసొమ్ము యెలాసంపాదించినా రండి?

కామా—ఏమో శవాలనుమోసి శల్యాశాభక్షణము చేసీ—

వీరా—సరిసరి బోధ పడ్డది. తమరు దుర్దాన దురన్నములకు పోరు గనుకనే మీరింత తక్కువగా సంపాదించినారు. మీకంటె నాలుగు వెనుకలు వచ్చినమీ దేశస్థులందరూ వొక్కొక్కడు నాలుగేసి వందల వరహాలు దేశానికి హుండీలు కట్టి పంపించినారు. ఇంతమంది తెలుగువాళ్ళను చూచినానుగాని మీవంటిమహానుభావులను యిది వరకు యెన్నడూ చూడలేదు. వక్కమాటు మీనామస్మరణ చేసుకుంటే సహస్రజన్మాల చేసినపాపాలు విమోచన మవుతవి.

కామా—నాయోగ్యత నీవు కనిపెట్టినావు. నీయోగ్యత నేను గ్రహించినాను. అన్నీ సరేకాని ఒకందాకటి సంగతిలో గొప్పచిక్కు సంభవించిందే.

వీరా—స్వామీ! ఏమిచెయ్యను? మీవంటి దొడ్డబ్రాహ్మడి కానగకాస్తా నేనే చేసిపెడుదునుగాని నాకు పనిలో యెక్కడా తీరుబడి లేదండి. నేను పోరుగూరువాణ్ణయినా నామాటఖరారునుబట్టి నగలు చెయ్యడానికి తులాలకొద్ది బంగారము బలవంతముగా నామీద నే పడవేసి పోతారండి.

కామా—వీరాసారి! నాకు నీ వీవుపకారం చెయ్యక తప్పదు. నీవుతప్ప నాకు యీవూళ్ళో నమ్మకమైనవారు యెవరూ కనపడడం లేదు. అదిగో చంకసంచీలో త్రాసూ రాళ్ళూలాగు వున్నవి. పుట్టి

తీసి యీవరాలు తీసుకో. నామాట కభ్యంతరం చెప్పవద్దు. న్యాయమైన మశాశత్తు——

వీరా——సరిసరి! మీకు నాలుగు వరాల సొమ్ము చేతిలో పెట్టకపోవడమే కాకుండా మీవద్ద కూలికూడా పుచ్చుకుంటానా? ఎంత మాట సెలవిచ్చినారు! వస్తువు చేసి యిచ్చినతరువాత మళ్ళీ తీసుకొని కొంచెం యిప్పటికంటె మొగ్గువుంటేనే నన్ను ఖాతరుచెయ్యండి. బాబూ! మీకు చెయ్యవలసిననగ లేమిటండీ?

కామా——నాచెవులకు కుండలాలున్నా నాభార్య మెడలోకి కంటె బిరికీల సజ్జాను. ఇదిగో బంగారం తీసుకో. బ్రాహ్మడికి వూరికే నగ చేసిపెట్టినందుకు నీకు శతసువర్ణదానఫలం వస్తుంది.

వీరా——కుండలాలు చేయించి నావంటి రిక్తుణ్ని కృతార్థుణ్ని చెయ్యడంచేత శతసువర్ణదానఫలము తమకే వస్తుంది.

(అని బంగారము తీసుకొను చున్నాఁడు.)

కామా——వస్తువు లెన్నాళ్ళలో చేసి తెస్తావు?

వీరా——ఏన్నోనాళ్ళా అండి? నాలుగు దినాలలో చేసి తీసుకుని వచ్చి దాఖలు చేసుకుంటాను. నగలు చూచిన తరువాత నా పనివాడితనానికి మెచ్చుకొని కలకాలమూ నన్ను తలచుకుంటూ వుంటారు. బాబూ! సెలవు పుచ్చుకోనా? (అని పోవుచున్నాఁడు.)

తృతీయరంగము——భోజనగృహము.

[కామావధానులు, సోమిదేవియు ప్రవేశించు చున్నారు.]

కామా——(పెరుగు జుర్రుచు) - నేను జన్మం యెత్తిన తరువాత యింతకంటె పెరుగు యెప్పుడూ తాగలేదు. మహాబాగా వున్నది.

సోమి——మీరు దేశం పోయి సొమ్ము సంపాదించుకు వచ్చిన

రన్న సంతోషంచేత పాలు నేను స్వయంగా కాచి తోడుపెట్టి యీ గట్టిపెరుగు మీకోసం చేసినాను.

కామ—మనకు పాలు యెక్కడవే ?

సోమి—యెక్కడవా ? మనగేదవే.

కామా—నీవు గేదెనుకూడా కొన్నావా ?

సోమి—కొనకపోతే యిన్నాళ్ళు నేను జీవనం యెలాగు చేసినా ననుకున్నారు ? నాపట్టెడ తాకట్టు పెట్టి యిరవైరూపాయలు తెచ్చి గేదెను కొని దానిపాలూ పెరుగూ నెయ్యీ అమ్మి సంసారం గడుపుకోవడమే కాకుండా కొంత మిగిల్చి చేసిన అప్పుకూడా తీర్చి వేసినాను.

కామా—నీవు బుద్ధిమంతురాలవు గనుక మంచిపని చేసినావు. అవునుగాని యీగేదెను నీకెవరు కొనిపెట్టినారే !

సోమి—ఒకరు కొనిపెట్టేదేమిటి ? మనడబ్బు పెట్టి మన యింటి పొరుగుననున్న కంసాలి పాపాసారివద్ద నేనే కొనుక్కున్నాను.

కామా—ఎంత తెలివిమాలినపని చేసినావు ! ఓసీ భ్రష్టురాలా! నావలెనే నీవున్నూ మాయలో పడిపోయినావు.

సోమి—ఏమిమాయ ?

కామా—ఏమయితే నేమి ? నీవు మోసపోయినావు. ఆడబుద్ధి అపరబుద్ధి అన్నవాడు వెఱ్ఱివాడా ?

సోమి—ఏమిమోసము ?

కామా—కంసాలివాడిదగ్గర కొన్నావు. అది నిశ్చయముగా లక్కగేదె. వాడు నిన్ను మాయలో పడవేసినాడు.

సోమి—గేదె స్పష్టముగా కనపడుతూవుండగానేనా ?

కామా—పయి కలాగే కనపడుతుంది. సొకుండలాలు చూచి

నావు కావూ? కంసాలివాడు మాయమాటలు చెప్పి నావద్ద బంగారం తీసుకొనిపోయి కుండలాలు చేసి తీసుకుని వచ్చినాడు. తూనిక సరి పోయింది, ఎత్తుసరిపోయింది, వన్నెసరిపోయింది, రూపం సరిపోయింది, అన్నీ సరిగా సరిపోయినవి. పయి కవి చూచేవారి కందరికీ శుద్ధసువర్ణ కుండలాలలాగే కనపడ్డవి. త్రోవలో మొన్న సంభావనకాడ పోట్లాడి విశాఖపట్నంలో గడేకారీవాడు నాచెవి పట్టుకుని లాగేటప్పటికి కుండలాలు పెళుక్కున విరిగి లోపలిలక్క బయులబడ్డది. కంసాలివద్ద కొన్నతరువాత యిది లక్కగేదె కాక తప్పదు.

సోమి.—పాలు యిస్తూవున్నదే?

కామా—పాలూ యిస్తుంది.

సోమి—గడ్డి మేస్తూవున్నదే?

కామా—గడ్డీ మేస్తుంది.

సోమి—దూడను వేస్తూవున్నదే?

కామా—దూడనూ వేస్తుంది.

సోమి—ఇన్నీవుంటే యిక లక్కగేదె యేమిషీ?

కామా—ఎన్నివున్నా కంసాలివద్ద కొన్నావు గనుక, ఇది నిస్సందేహముగా లక్కగేదె. మోసపోయినవాణ్ని మగవాణ్ని నాకు తెలుస్తుంది గాని కంసాలివాడిమాయ ఆడదానవు నీకు యేమి తెలుస్తుంది?

సోమి—మీకు మతిపోయినదా యేమి? దొడ్లోకివచ్చి గేదెను చూడండి.

కామా—నేను చూడనక్కరలేదు. నీవు కంసాలివద్ద గేదెను యెప్పుడు కొన్నానన్నావో నిజం నా కప్పుడే తెలిసింది. నీవిక వెయ్యి చెప్పు లక్షచెప్పు. నీమాట నేను నమ్మను. నీవు కొన్నది నిశ్చయంగా

లక్ష్మగేదె. నామాట త్రిలోకాలలోకి వెళ్లినా తిరగదు. విప్రవాక్యం జనార్దన మన్నాడు.

క. మేయఁగ నీ కస విటువలె,
నీయఁగ నీ పాలు, వేయు నీ దూడన్, ము
గ్ధా! యెఱుఁగ లేవు కంసలి
మాయన్, నిక్కమిది లక్ష్మమహిషమె సుమ్మీ!

సోమి——ఈపాటి యీమాటలు చాలించి విస్తరిముందునుంచి లేచి వేగిరము పోయిపరుండండి. రేపటికి మీమనస్సు స్వస్థపడుచుంది.

(ఇద్దఱును నిష్క్రమించుచున్నారు.)

స మా ప్త ము.

రాజమహేంద్రవరము:
పిళ్లారిశెట్టి సీతారామయ్య అండ్ సన్సువారి
శ్రీరామప్రెస్‌నందు ముద్రింపబడియె.—1949.